



# ఆకాశమే ఆమె హద్దు

## రాకెట్‌లా దూసుకువెళ్తున్న తెలుగు మహిళలు

## అంతరిక్ష రంగంలోనూ కీలక భూమిక

## ఇస్రో ఉపగ్రహ ప్రయోగాల్లో సత్తా

Women's Day

చందమామ రావే..జాబిల్లి రావే అంటూ అమ్మ గోరుముద్దలను తినిపించేది. ఆకాశంలో వెలిగిపోయే చంద్రుడ్ని చూపించేది. అయితే ఇప్పుడు ఆ చందమామనే చేరుకుందామంటున్నారు మన మహిళామూర్తులు. ఔను..ఇస్రో చంద్రయాన్-3 ప్రాజెక్ట్‌లో పురుషులకు దీటుగా భాగస్వాములై సత్తా చాటుకున్నారు. తాము అడుగుపెట్టని రంగమే లేదని నిరూపించుకున్నారు. సైన్స్ అన్నా సై అంటున్నారు. ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నారు ఇస్రోలోని మహిళా శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు. వీరి ప్రయాణం స్ఫూర్తిదాయకం. ఇస్రోలో ముఖ్య భూమిక పోషిస్తున్న ముగ్గురు తెలుగు మహిళల పరిచయం...

-సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి



### ఉపగ్రహాల రూప'కల్పన'



పుత్తూరు మండలం తడుకు గ్రామానికి చెందిన కాళహస్తి కల్పనకు చిన్నప్పటి నుంచే అంతరిక్ష రంగంపై ఆసక్తి. ఆ దిశగానే కెరీర్‌ను మలచుకున్నారు. తండ్రి మద్రాసు హైకోర్టులో ఉద్యోగి కావడంతో విద్యాభ్యాసమంతా చెన్నైలో సాగింది. తల్లి ఇందిర గృహిణి. చెన్నైలోని మద్రాసు విశ్వవిద్యాలయంలో కల్పన ఇంజినీరింగ్ చదివారు. అదే సమయంలో ఇస్రోలో ఇంజినీరింగ్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వెలువడటంలో ఆమె కల సాకారానికి తొలి అడుగు పడింది. 2000లో శ్రీహరికోట ఇస్రోలో రాడార్ ఇంజనీర్‌గా ఎంపికై వడివడిగా శాస్త్రవేత్తగా ఎదిగారు. ఐదేళ్లపాటు పనిచేశాక బెంగళూరు ఉపగ్రహ కేంద్రానికి బదిలీ అయ్యారు. అక్కడే శాటిలైట్ సిస్టమ్స్ ఇంజనీర్‌గా అనుభవం సంపాదించారు. ప్రాజెక్టు అసోసియేట్ డైరెక్టర్‌గా ఆరు ఉపగ్రహాల రూపకల్పనలో పాలుపంచుకున్నారు. చంద్రయాన్-3 వంటి కీలక ప్రాజెక్టులో అసోసియేట్ డైరెక్టర్‌గా బాధ్యత వహించారు. చంద్రయాన్-2లో కూడా కల్పన కీలక పాత్ర పోషించారు. రాడార్ ఇంజినీర్‌గా అడుగుపెట్టి విశేష కృషితో నేడు ఉపగ్రహాల తయారీలో ముఖ్య పాత్ర పోషించే స్థాయికి ఎదిగారు.

### ఉమా..ప్రతిభకు చిరునామా



గొట్టిముక్కల ఉమాదేవి.. చిరుద్యోగిగా కెరీర్‌లో అడుగుపెట్టి అసాధారణ ప్రతిభతో ఉన్నతస్థాయికి దూసుకువెళ్లారు. హైదరాబాదులోనే పుట్టి పెరిగారు. మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా పూర్తవ్వగానే నేషనల్ రిమోట్ సెన్సింగ్ శాటిలైట్ సెంటర్(హైదరాబాద్)లో సాధారణ ఉద్యోగిగా చేరారు. 1988లో భారతీయ రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాల కోసం కొత్త గ్రౌండ్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరగడం ఉమాదేవికి కలిసొచ్చింది. ఎన్ఆర్ఎస్‌సీలో అనుభవంతో గ్రౌండ్‌స్టేషన్‌లోని శాటిలైట్ డేటా విభాగంలో సీనియర్ ఉద్యోగిగా చేరారు. ఆమెలోని ప్రతిభకు,చొరవకు ఇస్రో సీనియర్ అధికారుల నుంచి ప్రోత్సాహం లభించింది. ఆ తత్వమే ఆమెను కొత్త ఆవిష్కరణల్లో భాగస్వామిని చేసింది. విజయాల నమోదుకు కారణమైంది. ఉన్నతంగా ఆలోచించే ఉమాదేవి భూటాన్‌లో ఇస్రో కొత్తగా స్థాపించిన గ్రౌండ్ స్టేషన్‌కు సారథ్య బాధ్యతలు చేపట్టారు. ఈమె తండ్రి గోపాలరావు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వద్ద సీఎస్‌గా పనిచేశారు. తల్లి లక్ష్మీబాయ్ గృహిణి.

### సెన్సార్ సాంకేతికతలో 'విజయ' ప్రస్థానం



యంద్రపల్లి విజయ.. పట్టుదలకు కేరాఫ్‌గా నిలిచే ఈ తెలుగుబిడ్డ కృష్ణాజిల్లా ముదునూరులో సామాన్య కుటుంబంలో పుట్టారు. తండ్రి గంగాధర్ కోపరేటివ్ బ్యాంకులో సాధారణ ఉద్యోగి. తల్లి వెంకటరత్నం గృహిణి. విజయవాడలోని పటమట ప్రభుత్వ పాఠశాలలో విజయ పదోతరగతి వరకూ చదివారు. సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల(విజయవాడ)లో ఇంజనీరింగ్ చదివారు. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో పీజీలో సీటొచ్చింది. చేరిన నెల రోజులకే అనూహ్యంగా ఇస్రోలో ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఐఐటీ సీటు వదులుకోవడం బాధనిపించినా అంతరిక్షరంగంపై మక్కువ ఆకర్షించింది. బెంగళూరులోని సెన్సార్లు తయారయ్యే ఇస్రో ఎలక్ట్రో ఆప్టిక్స్ సిస్టమ్స్‌లో చేరారు. తొలినాళ్లలోనే ప్రతిభ చాటుకున్నారు. ఆమె నేతృత్వంలో రూపొందించిన సెన్సార్‌ను ప్రప్రథమంగా పీఎస్ఎల్వీ ప్రాజెక్టుకు వినియోగించారు. అనంతరం మరో క్లిష్టమైన స్టార్ సెన్సార్ తయారీలో సఫలీకృతమయ్యారు. ఓషన్‌శాట్-3, జీశాట్, రీశాట్ సిరీస్‌లో కొత్త ఉపగ్రహాల్లో ఈ సాంకేతికతను వినియోగించారు. మైక్రోశాట్‌లో తక్కువ బరువుతో స్టార్ సెన్సార్‌ను రూపొందించి విస్మయపరిచారు. ఇదే సెన్సార్‌ను చంద్రయాన్-3లోనే కాదు గగన్‌యాన్‌కు కూడా ఉపయోగించారు. ఈమె గగన్‌యాన్ ప్రాజెక్టుకు డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు. ఇస్రోలో పురుషులకు దీటుగా అవకాశాలను అందిపుచ్చుకుని కీలకమైన సెన్సార్ విభాగంలోనూ విజయ తనదైన ముద్ర వేసుకుంటున్నారు.



## అత్తను చంపిన అల్లుడు

- నగదు, నగల కోసం తిరుపతిలో కిరాతకం

8లో

**రంజాన్ వేళలు**
ఇఫ్తార్ (శనివారం) : 6.25
సహరి (ఆదివారం) : 5.06

## కూలీలపైకి దూసుకెళ్లిన మినీ లారీ

- హైవే డివైడర్ వద్ద గ్రీనరీ పనులు చేస్తున్న ఇద్దరి దుర్మరణం
- ముగ్గురికి తీవ్ర గాయాలు
- మృతులది పెళ్లకూరు మండలం భీమవరం

## ఇక నిఘా నీడలో నగరం

తిరుపతి, మార్చి7(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో ఏమి జరిగినా తెలిసేలా అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ కోసం నగరంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్న ప్రాంతాలను శుక్రవారం స్మార్ట్ సిటీ, నగరపాలక సంస్థ, పోలీసు అధికారులతో కలసి పరిశీలించారు.పలు మార్పులను అధికారులకు సూచించారు. మౌర్య మాట్లాడుతూ స్మార్ట్ సిటీ నిధులతో నగరంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తద్వారా అసాంఘిక శక్తులను, పారిశుధ్య పనులను, ఆక్రమణలను, నేరాలను సులువుగా గుర్తించవచ్చునని తెలిపారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఈఈ.రవి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.



## విద్యార్థినులకు బహుమతుల అందజేత

పాకాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమేష్‌కుమార్ ఆకాంక్షించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అతిధిగా పాల్గొన్న పార్ధసారథి నాయుడు మాట్లాడుతూ విద్యతోనే స్త్రీల సమస్యలకు నిజమైన పరిష్కారం లభిస్తుందన్నారు. మహిళా విభాగం సమన్వయ కర్త డాక్టర్ మాదవి మహిళల హక్కుల గురించి వివరించారు. విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఎన్ఎస్ ఎస్పీవో మాశిలామణి, అధ్యాపకులు చిట్టికళావతి, రమణమ్మ, ఈశ్వరబాబు, ఆదిశేఖరరెడ్డి, మోహన్, విష్ణుప్రియ, నాగమణి, వాలంటీర్లు, పాల్గొన్నారు.

## మహిళా వైద్య సిబ్బందికి, కార్మికులకు సన్మానం



చంద్రగిరి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక సీహెచ్‌సీలో మహిళా వైద్యులు, సిబ్బంది, కార్మికులను మన సంస్కృతి సేవా ట్రస్ట్ సన్మానించింది. పారిశుద్య కార్మికులు బట్టలు, స్వీట్లు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్, బీజేపీ జిల్లా కార్యదర్శి కాయం హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ మన దేశంలో స్త్రీలను పురాణకాలం నుండి గౌరవించే సంస్కృతి ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రూపా రామమూర్తి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.అరుణ, బీజేపీ నాయకులు సుబ్రహ్మణ్యం యాదవ్, వెంకటముని, పురుషోత్తమ రెడ్డి, ఇందు శేఖర్, జయరాము, తదతరులు పాల్గొన్నారు.

## బీసీ రుణాల ఇంటర్వ్యూల్లో గందరగోళం



చంద్రగిరి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం బీసీ, కాపు, కమ్మ, రెడ్డి, వైశ్య, బ్రాహ్మిన్, క్షత్రియ కార్పొరేషన్ రుణాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలు నిర్వహణలో గందరగోళం ఏర్పడింది. అందరికీ ఒకేరోజే ఇంటర్వ్యూలు నిర్వహించడం, బ్యాంకు అధికారులు హాజరకాకపోవడం, పేర్లు బ్యాంకుల జాబితాలో తారుమారు కావడంతో అయోమయానికి గురయ్యారు. చివరకు బ్యాంకు అధికారులకు జాబితాను పంపించామని ఎంపీడీవో శేఖర్ చెప్పారు. ఆ జాబితాలో బ్యాంకులు ఎవరికైతే రుణాలు ఇస్తాయో వారికే రాయితీకి సిఫార్సు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. దీంతో అభ్యర్థులు ఊపిరి పీల్చుకున్నారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



శివపురం కాలనీలో అక్రమ నిర్మాణం తొలగింపు

తిరుచానూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు, పాడిపేటపంచాయతీల్లో కొంత మంది అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను శుక్రవారం రూరల్ తహసీల్దారు రామాంజుల నాయక్ ఆధ్వర్యంలో కూల్చివేశారు. ఆగని అక్రమ నిర్మాణాల శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. దీంతో స్వర్ణముఖీతీరం సర్వేనెంబరు 479లో కట్టిన రేకుల షెడ్డును, పాడిపేట శివపురం కాలనీలో సర్వే నెంబరు 233/2ఏలో నిర్మించిన ఇళ్లను ఆర్ఐ రఘువర్మ, వీఆర్వోలు బాబ్జీ, యోగానంద్ నేలమట్టం చేశారు.

## శిల్పారామాన్ని మరింత అభివృద్ధి చేస్తాం



మాస్టర్‌ప్లాన్ పనులను పరిశీలిస్తున్న స్వామినాయుడు

తిరుచానూరు,మార్చి 7(ఆంధ్రజ్యోతి): శిల్పారామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని రాష్ట్ర శిల్పారామం సంస్థ సీఈవో స్వామినాయుడు చెప్పారు. తిరుచానూరు రోడ్డులోని శిల్పారామాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పర్యాటకులకు మరిన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. బుద్ధుని ప్రతిమతో కూడిన ఫౌంటేషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మరిన్ని వసతులు తీసుకువస్తామన్నారు. పారిశుధ్యానికి పెద్దపీట వేసి పచ్చదనం పెంపుపై తుడాను సమన్వయం చేసుకోవాలని ఏవో ఖాదరవల్లికి సూచించారు. ఏఈ రాధాకృష్ణ, యశ్వంత్ పాల్గొన్నారు.

## ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు: ఆర్డీవో

రామచంద్రాపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం నూతుకుంటపల్లిలో ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారనే సమాచారంతో ఆయన పరిశీలించారు. మండల సర్వేయర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో యంత్రాలతో చదును చేసి ఆక్రమణ ఉంటే నివేదిక ఇవ్వాలని తహసీల్దారు వెంకటరమణ ఆదేశించారు. అక్రమ గ్రావెల్ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టడానికి విస్తృతంగా తనిఖీ చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఆర్ఐ లక్ష్మీనారాయణ, మణి, వీఆర్ఏలు బాలు, గీతలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన చాణుక్య

చంద్రగిరి,మార్చి 7(ఆంధ్రజ్యోతి): అనుప్పల్లె-చంద్రగిరి మార్గంలో ఇందిరమ్మ కాలనీ వద్ద శుక్రవారం రాత్రి 7 గంటలకు ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు సీ.మల్లవరానికి చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ సురేష్ కుమారుడు చాణుక్య(24) శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై మల్లయ్యపల్లె నుంచి చంద్రగిరి వస్తుండగా దోర్నకంబాల వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

## బ్యాంకుల్లో ఖాళీలను భర్తీ చేయండి

తిరుపతి(ఆటోనగర్), మార్చి7(ఆంధ్రజ్యోతి): జాతీయ బ్యాంకుల్లో ఖాళీలను భర్తీ చేసి, పనిభారం తగ్గించాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్స్ యూనియన్ కన్వీనర్ పి.విజయభాస్కర్, టీబీఈసీసీ ప్రధాన కార్యదర్శి జె.ధన్వంత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు టీపీ ఏరియాలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎదుట శుక్రవారం సాయంత్రం యూఎఫ్‌బీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ గతేడాది మార్చిలో కేంద్ర ప్రభుత్వం బ్యాంక్ ఉద్యోగ సంఘాలతో కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఐదు రోజుల పనిదినాలు, పాత పించను విధానం అమలు చేయాలని కోరారు. అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. నాయకులు జనార్దన్, భాస్కర్, కేశవరెడ్డి, మహేష్, సుమలత, రేష్మ, నిర్మల, వెంకటలక్ష్మి, యగ్నేష్‌బాబు,నందకుమార్, పవన్‌కుమార్, శంకర్‌రావు, లక్ష్మీపతి,నట్రాజ్ పాల్గొన్నారు.

## వాహనచోదకులకు జరిమానా

తిరుమల, మార్చి7(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించిన వారికి రూ.51 వేల జరిమానా విధించారు. అతివేగంగా వాహనాలను నడపడం, రోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేయడం వంటి చర్యలకు పాల్పడిన 41 మంది ట్యాక్సీ డ్రైవర్లు, వాహన యజమానులకు తిరుమల క్యాంపు కోర్టు రూ.41 వేల జరిమానా విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరి వ్యక్తులకు రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు.

## మద్యం షాపు తొలగించాలని అర్ధనగ్న ప్రదర్శన

తిరుపతిరూరల్, మార్చి7(ఆంధ్రజ్యోతి): సాయినగర్‌లో మద్యంషాపును తొలగించాలంటూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈసందర్భంగా సంఘ నేతలు మాట్లాడుతూ సమీపంలో పాఠశాలలు, ప్రైవేట్ హాస్టళ్లు, హాస్పిటల్స్ జనావాసాలు ఉన్నా ఎక్సైజ్ అధికారులు అనుమతి ఇవ్వడం సరికాదన్నారు. కాగా ఇదేషాపు ఎదుట కొన్నిరోజులుగా నిరసనలు జరుగుతుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

## 10న బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

తిరుపతి రూరల్, మార్చి7(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఈనెల10న బీసీ కార్పొరేషన్ రుణాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామచంద్ర పేర్కొన్నారు. బ్రాహ్మణ, ఈబీసీ, కమ్మ, క్షత్రియ,రెడ్డి, వైశ్య, కాపు తదితర కార్పొరేషన్ల రుణాలకు దరఖాస్తు చేసిన వారి ఎంపిక ప్రక్రియ చేపడుతున్నామన్నారు. బ్యాంకుల మేనేజర్లు, బీసీ కార్పొరేషన్ అధికార ప్రతినిధులు హాజరవుతారన్నారు. అభ్యర్థులు సర్టిఫికెట్లతో రావాలని కోరారు.

## ఈశ్వరరెడ్డికి నివాళులు

రామచంద్రాపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నెన్నూరు గ్రామంలో మృతి చెందిన వైసీపీ నాయకుడు, రాఘవ హేచరీస్ అధినేత కె.ఈశ్వరరెడ్డికి పలువురు శుక్రవారం నివాళులు అర్పించారు. ఆయన అంత్యక్రియలకు వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. హేచరీస్ అధినేతగా అందరికి సుపరిచితులు కావడంతో పార్టీలకు అతీతంగా అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

## ఉమ్మడి పీజీ సెట్ రద్దు కోసం ధర్నా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పీజీసెట్‌ను రద్దు చేయాలని కోరుతూ ఎస్వీయూలోని పీజీసెట్ కార్యాలయం ముందు విద్యార్థి సంఘాలు శుక్రవారం ధర్నా నిర్వహించాయి. ఏఐఎస్ఎఫ్ నేతలు బండి చలపతి, ఉదయ్, ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ నేత వినోద్, బీసీ విద్యార్థి సంఘ నేత తిరుమలేష్, లా స్టూడెంట్ యూనియన్ నేత సుందర్రాజు, ట్రైబల్ స్టూడెంట్ యూనియన్ నేత పాల్యా శివశంకరనాయక్, ఏఐఎస్ఏ నేత చిన్నా, జేబీఎస్ఎఫ్ నేత భార్గవ తదితరులు మాట్లాడారు. పీజీ అడ్మిషన్ల బాధ్యత యూనివర్సిటీలకే అప్పగించకపోతే అడ్మిషన్లు తగ్గిపోతున్నాయన్నారు. పీజీసెట్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్ చించివేశారు.విషయాన్ని ఉన్నత విద్యా మండలి చైర్మన్ దృష్టికి తీసుకెళతానని పీజీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు హామీ ఇచ్చారు.

## శ్రీవారి సేవలో ప్రముఖులు



అమర్నాథ్‌రెడ్డి, బోర్డు సభ్యులు శాంతారామ్, నర్సిరెడ్డి

తిరుమల, మార్చి7(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి, బోర్డు సభ్యులు శాంతారామ్, నర్సిరెడ్డి, మాజీ ఎంఎల్సీ పోతుల సునీత ఉన్నారు.

# స్వయం ఉపాధితో స్వావలంబన

నేడు అంతర్జాతీయ మహిళాదినోత్సవం

**ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని పలువురు మహిళలు తమ బతుకుల్లో వెలుగులు నింపుతున్నారు. కుటుంబ సారథులుగా నిలుస్తున్నారు. ఏ ఆసరాలేని సమయంలో కారుచీకటిలో కాంతరేఖలా కనిపించిన వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందంజ వేస్తున్నారు. రెండున్నర దశాబ్దాల క్రితం చంద్రబాబు ప్రవేశపెట్టిన వెలుగు పథకం కింద స్వయంసహాయం సంఘాలను ఏర్పాటు చేసుకున్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొందుతూ మరికొందరికి ఆసరాగా నిలుస్తున్న మహిళలను ఒకసారి పలకరిస్తే.. - తిరుపతి రూరల్,ఆంధ్రజ్యోతి**



నాటుకోళ్ల షెడ్డులో తరుణి

నాపేరు తరణి. మాది దుర్గసముద్రం. లక్ష్మీపార్వతిసంఘంలో సభ్యురాలి చేరాను. ప్రకృతి వ్యవసాయంలో ఐసీఆర్‌పీగా కూడా పనిచేస్తున్నా. కేంద్ర నిధులు రూ.3లక్షలు, ఉపాధిహామీ నుంచి రూ.లక్ష, సంఘం నుంచి రూ.లక్ష తీసుకుని నాటుకోళ్ల పెంపకం చేపట్టా. సంఘంలో మరోదఫా రూ.75వేలు తీసుకుని ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాం. లింకేజీ రూ.1.50లక్షలు తీసుకుని పిల్లల ఫీజులు చెల్లించాను. స్త్రీనిధిలో రూ.50వేలతో జెర్సీ ఆవు కొన్నాను. వీటి ద్వారా నెలకు రూ.25వేలు సంపాదిస్తూ రుణాన్ని సక్రమంగా చెల్లిస్తున్నాను.



గ్రైండర్ వద్ద భారతి

నాపేరు భారతి. 20 ఏళ్ల క్రితం పుదిపట్లలో శారదామాతసంఘంలో సభ్యురాలిగా చేరా. సంఘంలో అప్పు తీసుకుని గ్రైండర్లు కొనుకుని పిండిని రుబ్బి అంగళ్లకు వేసేవారం. అబ్బాయి ఎంబీఏ పూర్తవ్వడంతో వ్యాపారంపై దృష్టిపెట్టాం. పీఎంఎఫ్ఎంఈ ద్వారా రూ.10లక్షలు తీసుకుని చపాతీ తయారీ, పిండి మిక్సింగ్ మిషన్ కొనుకున్నాం. రుణం తీర్చేశాం. ఈక్రమంలోనే పీఎంఈజీపీ కింద రూ.9.5లక్షలు తీసుకుని పరోటా తయారీమిషన్, మిగిలిన యంత్రాలు కొనుకున్నాం. తద్వారా నెలకు రూ.20వేలవరకు ఆదాయం వస్తుంది.



షామియానాషాపులో మోహనకుమారి

నాపేరు మోహనకుమారి. 2003లో అవిలాల వీవో-4లోని ఈశ్వరిసంఘంలో సభ్యురాలిగా చేరా. జీతం సరిపోక చిన్న వ్యాపారం చేయాలని సంకల్పించాను. సంఘంలో రూ.2లక్షల రుణం తీసుకున్నాను. ఆర్‌సీరోడ్డు బైపాస్ వద్ద షామియానా అంగడి పెట్టాను. ఇందుకు అవసరమైన ఆటో కూడా కొనుకున్నా. షామియానా వేయడం నేర్చుకున్నా. దీన్ని ద్వారా వచ్చే ఆదాయంతో సంఘం నుంచి తీసుకున్న అప్పులు చెల్లిస్తున్నా. పెద్దమ్మాయిని డిగ్రీ చదివించి పెళ్లి చేశాను. మా.రెండో అమ్మాయి బీటెక్ చదువుతోంది.

## నో ఫ్లయింగ్ జోన్‌పై పార్లమెంట్‌లో మాట్లాడతాం

● ఎంపీ అప్పలనాయుడు



తిరుమల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): తిరుమల నో ఫ్లయింగ్ జోన్ అంశంపై పార్లమెంట్‌లో మాట్లాడతామని ఎంపీ అప్పలనాయుడు తెలిపారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తిరుమల పవిత్ర, ఆగమశాస్త్ర నిబంధనలను కాపాడేందుకు తిరుమలను నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించాలంటూ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు లేఖ రాసారని, దీనిపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి కూడా తీసుకువెళ్లి చర్చిస్తామన్నారు. తిరుమలలో అన్నప్రసాదాలు ఎన్డీయే కూటమి వచ్చిన తర్వాత చాలా రుచికరంగా ఉన్నాయని భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.

## ఓటేరు భూములపై రైతులకు అన్యాయం చేయడం తగదు

● ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఎస్సీవీ నాయుడు హితవు



శ్రీకాళహస్తి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం ఓటేరు భూములకు సంబంధించి రైతులకు అన్యాయం చేసేలా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వ్యవహరించడం తగదని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు అన్నారు. శుక్రవారం ఆయన తన స్వగృహంలో ఓటేరు భూములపై మీడియాతో మాట్లాడారు. చెరువు భూములు.. రైతుల భూములు వేర్వేరని తాను ఇప్పటికే ఎన్నో సార్లు బ్రిటీష్ కాలం నుంచి ఉన్న రికార్డులను బహిర్గతం చేశానన్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, వైసీపీ నేత, చంద్రగిరి మాజీఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో కలిసి మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు నడపడం దుర్మార్గమన్నారు. తాను టీడీపీ ఆవిర్భావం, పునాది దశ నుంచీ పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. శ్రీకాళహస్తితో పాటు పొరుగున ఐదు నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేశానన్నారు. బొజ్జల కుటుంబంతో రాజకీయంగా మూడు తరాల నుంచి కలిసి నడుస్తున్నట్లు చెప్పారు. తామంతా వెంట ఉండి కష్టపడటంతో అదృష్టవశాత్తు ఎమ్మెల్యేగా గెలిచిన సుధీర్‌రెడ్డి.. అహంకార ధోరణితో వ్యవహరించడం మానుకోవాలన్నారు. గుడి,బడి ఏవీ వదలకుండా అక్రమాలకు పాల్పడుతున్న విషయాలను చంద్రబాబు, నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎమ్మెల్యేపై వంద పేజీల అవినీతి అక్రమాల చిట్టాను బహిర్గతం చేస్తామన్నారు. పార్టీ పెద్దలు ఆదేశిస్తే పూర్తి ఆధారాల సహా లిఖితపూర్వకంగా సమర్పిస్తామన్నారు. ఎమ్మెల్యే మ్యాచ్‌ఫిక్సింగ్, అక్రమాలను ఎప్పటికప్పుడు వారం వారం వెల్లడిస్తామన్నారు. టీడీపీలో ఉంటూ పార్టీని భ్రష్టు పట్టించడం తగదని, పార్టీ పటిష్టత కోసం తాను ఎంత వరకైనా పోరాడతానన్నారు.

## అన్ని రంగాల్లో మహిళలు రాణించాలి



మహిళా పోలీసులకు జ్ఞాపిక అందజేస్తున్న సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్

తిరుపతి అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వ్యాపార, పారిశ్రామిక, సేవా రంగాలలో రాణించిన మహిళలు దేశ, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములవుతారని సెట్విన్ సీఈవో కె.మోహన్ కుమార్ అన్నారు. స్థానిక ఎమరాల్డ్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మోహన్ కుమార్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు పురోగతి సాధించాలని కోరారు. డీఎస్పీ శ్రీలత మాట్లాడుతూ చదువుపై శ్రద్ధ వహించాలని, తద్వారానే ఉన్నత స్థాయికి చేరుకోగలరని తెలిపారు. అనంతరం మహిళలకు డిబేట్, ఎలక్ర్యూషన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉత్తమ సేవలందించిన ఏఎస్సై గిరిజా, హెడ్‌కానిస్టేబుల్ ప్రశాంతి, కానిస్టేబుల్స్ విజయ, స్వాతి, నీరజలను సత్కరించారు. కార్యక్రమంలో ఎమరాల్డ్స్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.మునిరత్నం పాల్గొన్నారు.

## మహిళా టీచర్లకు సన్మానం

తిరుపతి (జీవకోన), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 45వ డివిజన్ శివజ్యోతి నగర్ తంబువానిగుంట మున్సిపల్ స్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉపాధ్యాయులు, వర్కర్లను స్కూల్ కమిటీ చైర్మన్ కదిరి రాజేంద్ర ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ప్రధానోధ్యాయురాలు సుజాత, రఘునాథ్, స్థానికులు కొత్తపల్లి మునిరత్నం, శంకరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళల సహకారంతో ఆర్థికాభివృద్ధి

తిరుపతి (ఆటోనగర్) మార్చి7(ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ రంగం అభివృద్ధిలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్స్ యూనియన్ కన్వీనర్ పి.విజయభాస్కర్, టీబీఈసీసీ ప్రధాన కార్యదర్శి జె.ధన్వంత్‌కుమార్ పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎదుట మహిళా ఉద్యోగులు శుక్రవారం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

## పేదలకు ఉచిత వైద్యం అందించాలి



కాంగ్రెస్ నేతలతో కలిసి లత నిరసన తెలుపుతున్న చింతామోహన్

తిరుపతి(వైద్యం), మార్చి 7(ఆంధ్రజ్యోతి): పేదలకు సరైన వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారని, దీనిపై టీటీడీ దృష్టి సారించాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ కోరారు. రుయాను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చాలని కోరుతూ టీటీడీ పరిపాలనా భవనం ముందు ఆయన శుక్రవారం కాంగ్రెస్ నేతలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. చింతా మాట్లాడుతూ రుయాస్పత్రిలో వైద్య సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయన్నారు. కర్నూలు, గుంటూరు, వైజాగ్ వంటి ప్రాంతాల్లోని జీజీహెచ్ ఆస్పత్రుల్లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తుంటే రుయాలో ఎందుకు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదో సమాధానం చెప్పాలన్నారు. నేతలు యార్లపల్లి గోపి గౌడ్, రవి, తేజోవతి, మునిశోభ తదితరులు పాల్గొన్నారు

# అతివలకు వందనం..!



ఆడాళ్లూ..మీకు జోహార్లు.. ఓపిక, ఒద్దిక మీపేర్లు.. మీరు ఒకరికంటే ఒకరు గొప్పోళ్లు అని ఓ సినీకవి ప్రస్తుతించారు. మహిళల ఔన్నత్యాన్ని రెండు ముక్కల్లో కీర్తించారు. నిత్య జీవితంలో నేడు మహిళలు పురుషులకు ఏమాత్రం తీసిపోని విధంగా పనిచేస్తున్నారు. ప్రతి రంగంలో తామున్నామని సత్తా చాటుకుంటున్నారు. చదువుకుని ఉద్యోగాల్లోనే కాదు...చెమటోడ్చడంలోనూ ముందుంటున్నారు. కొందరు ఇంటి బాధ్యతలను పూర్తిగా భుజానకెత్తుకుంటున్నారు. మండుటెండలో ఇటుకల మోత నుంచి పూలమ్మేవరకూ అన్నిటా మహిళామణులు స్వేదం చిందిస్తున్నారు. జీవన పోరాటంలో తమ పాత్ర తక్కువేమీ కాదని నిరూపిస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవవేళ ఈ కష్టజీవుల శ్రమైక సౌందర్యానికి దర్పణం పట్టే చిత్రాలివి.

- తిరుపతి , ఆంధ్రజ్యోతి









# ఆచార్య వెన్నం ఉమ

## పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వీసీ

చదువు ఒక్కటే తానిచ్చే ఆస్తి అని బలంగా నమ్మే తండ్రి ప్రభావం ఆమెపై చెరగని ముద్ర వేసింది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పట్టుదలతో చదువుకునేలా ప్రేరణ ఇచ్చింది. అందుకే ఆమె నాన్నే తన తొలి గురువు అని చెబుతారు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ఆచార్య వెన్నం ఉమ. ఆది నుంచీ సామాజిక విషయాలపై ఉన్న ఆసక్తితో డిగ్రీలో సోషియల్ వర్క్ సబ్జెక్టును ఎంపిక చేసుకున్నారు. ఉన్నత విద్యా సంస్థలో చదివించాలనే కాంక్షతో 1983లో ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియల్ సైన్సెస్‌లో ఎంఏ కోర్సు చదివారీమె. బోధనతో ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకత్వం వహించే అవకాశం ఉంటుందని భావించారు. ఆదిశగానే కెరీర్‌ను ప్రారంభించారు. నాలుగు దశాబ్దాల పాటు యూనివర్సిటీ స్థాయిలో ప్రొఫెసర్‌గా పని చేసిన ఉమ వివిధ హోదాల్లో పనిచేశారు. పట్టుదలనిండైన ఆత్మవిశ్వాసం ఆమెను పద్మావతి మహిళా వర్సిటీకి సారథిని చేశాయి.



"చదువుతో ఏమైనా సాధించవచ్చు. సమాజంలో గుర్తింపు, గౌరవాన్ని పొందవచ్చు. ఏ రంగంలో ఉన్నా అంకిత భావం, సామాజిక బాధ్యత, నైతిక విలువలను మరవకూడదు. ఇవే అద్వితీయ శక్తులుగా తీర్చిదిద్దుతాయి. చదువు ఉద్యోగం కోసం మాత్రమే కాదని గుర్తించాలి. స్పష్టమైన లక్ష్యంతో, సంకల్పం బలంతో పనిచేయాలి. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి.

మహిళా దినోత్సవం



## అన్నాచెరువు చేపల టెండర్లకు ఆదరణ కరువు

తిరుపతి అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లి పరిధిలోని అన్నాచెరువు చేపల టెండర్ దక్కించుకునేందుకు ఒక్కరూ ముందుకు రాకపోవడంతో ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చింది. ఈ చెరువుకు గతనెల 24, ఈ నెల 1, 4 తేదీలలో టెండర్ ప్రక్రియ ఉంటుందని ప్రకటించినా కొన్ని కారణాల వల్ల వాయిదా వేయాల్సి వచ్చింది. ప్రస్తుతం కాలపరిమితి తక్కువగా ఉండడం, ప్రభుత్వం నిర్ణయించిన పాట ఎక్కువగా ఉండడంతో ఔత్సాహికులు ఆసక్తి చూపడంలేదని తెలుస్తోంది. టెండర్ కాస్ట్ తగ్గిస్తే తప్పా పాటదారులు ముందుకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదని శెట్టిపల్లి పంచాయతీ సచివాలయ కార్యదర్శి మురళి డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ సురేష్‌నాయుడికి గత బుధవారం నివేదించారు. ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

## పురందేశ్వరికి బీజేపీ నేతల స్వాగతం



పురందేశ్వరికి స్వాగతం పలుకుతున్న సామంచి శ్రీనివాస్, బీజేపీ నేతలు

తిరుపతి (ఉపాధ్యాయనగర్), మార్చి 7(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి స్థానిక బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. చిత్తూరులో మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆమె శుక్రవారం తిరుపతికి వచ్చారు. రేణిగుంట విమానాశ్రయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు చంద్రప్ప, జిల్లా కార్యదర్శి వరప్రసాద్, మీడియా కో-ఆర్డినేటర్ పొన్నగంటి భాస్కర్, డాక్టర్ శ్రీహరిరావు, గాలి పుష్పలత, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటశివనారాయణ, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి, స్వాగతం పలికారు.

## సీతమ్మ వీలునామాకు కట్టుబడి ఉన్నాం

తిరుపతి అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పంగుళూరి సీతమ్మ వీలునామాకు కట్టుబడి కార్యాచరణ చేస్తున్నామని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పామిడి సత్యనారాయణశెట్టి స్పష్టం చేశారు. శుక్రవారం ఆలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఆకాంక్షలకు అనుగుణంగా సీతమ్మనగర్(ఎమ్మార్‌పల్లి సీతమ్మ భూములు)లో 102అడుగుల వాసవి అమ్మవారి విగ్రహం, ఆలయం,కల్యాణమండపం, వసతి గృహాలు, పాఠశాల నిర్మాణం చేపట్టాలని సంకల్పించామన్నారు. మిగిలిన స్థలాన్ని వీలునామా నియమావళికి అనుగుణంగా లీజుకు ఇవ్వదలిచామన్నారు. ఈ ప్రకారమే సీతమ్మనగర్‌లో గతేడాది భూమిపూజ చేశామన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో ఆరుగురికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం),మార్చి7(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన ఆరుగురికి జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగవ అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ తీర్పు చెప్పారు. నగరంలో కొన్ని రోజులుగా తాగి వాహనాలు నడిపిన ఆరుగురిని ట్రాఫిక్ పోలీసులు గుర్తించి, కేసులు నమోదు చేశారు. వీరిని శుక్రవారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10వేలు వంతున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

## ఎండీపుత్తూరు-మంగళం పైపులైను పనులను వేగవంతం చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఎండీపుత్తూరు-మంగళం వరకు టీటీడీ నిధులతో వేసే పైపులైను పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీటీడీ సంస్థలకు, మున్సిపల్ కార్పొరేషన్‌కు మంచినీటి కొరత లేకుండా చూడాలన్నారు. మున్సిపల్ కమిషనర్, ఏపీఐఐసీ అధికారులు సమన్వయంతో పైపులైను పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఏపీఐఐసీ తిరుపతి జోనల్ మేనేజరు విజయభరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హాస్టళ్లలో మరమ్మతు పనులు నాణ్యంగా ఉండాలి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో అవసరమైన మరమ్మతు పనులను నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పేద పిల్లలు చదువుకునే సంక్షేమ వసతిగృహాల్లో, గురుకుల పాఠశాలల్లో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. నాణ్యత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

## ఓటేరు చెరువును రక్షించండి




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం ఓటేరు చెరువును భూ కబ్జాదారుల నుంచి రక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం నాయకులతో కలిసి ఆయన శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. చెరువును పరిరక్షించాలని వామపక్షాల నేతలు ఆందోళన చేస్తుంటే శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు విమర్శలు చేయడం శోచనీయమన్నారు. భూమి ఆయనకు చెందిందైతే హైవే వేసిన సమయంలో ఎంత పరిహారం చెల్లించారో చెప్పాలని డిమాండ్ చేశారు. తన భూమి అయితే రాత్రి సమయంలో నిర్మాణ పనులు చేపట్టాల్సిన అవసరం ఏముందన్నారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు.

## జిల్లా ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడి మృతి



నాగభూషణం (ఫైల్ ఫొటో)

తిరుపతి అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఆడిటర్, జిల్లా ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.నాగభూషణం(64) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వీఏ.అజయ్‌కుమార్, కార్యదర్శి ఎంఏ.సునీల్‌అమిద్, సంయుక్త కార్యదర్శి జెకేశవులనాయుడు, ట్రెజరర్ సి.ఉమాపతి, సభ్యులు సంతాపం తెలిపారు. అకౌంటింగ్, ట్యాక్సేషన్ రంగాలకు ఆయన విశేషంగా సేవలందించారని కొనియాడారు. ఏపీ జీఎస్టీ, సీఎస్టీ, వీఏటీలలో సులభతరమైన అంశాలను తీసుకురావడానికి అసోసియేషన్ తరపున కృషి చేశారని పేర్కొన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు హరిశ్చంద్ర శ్మశాన వాటికలో అంత్యక్రియలు ఉంటాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

## వైసీపీ కార్పొరేటర్లకు తేనీటి విందు

తిరుపతి (జీవకోన), మార్చి 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ వైసీపీ కార్పొరేటర్లకు మేయర్ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో శుక్రవారం కరకంబాడి రోడ్డులోని ఆమె నివాసంలో తేనీటి విందు ఏర్పాటు చేశారు. మేయర్‌గా ఎన్నికై నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. ముఖ్య అతిథులుగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి హాజరయ్యారు. తిరుపతిలో రాజకీయ పరిణామాలపై సమీక్షించారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్ పాల్గొన్నారు.

## నేటి నుంచి సంస్కృత వర్సిటీలో జానపద విజ్ఞాన సదస్సు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు),మార్చి7(ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో శనివారం నుంచి జానపద విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నారు. దక్షిణాత్య జానపద విజ్ఞాన సంస్థ, సంస్కృత విశ్వవిద్యాలయం సంయుక్తంగా మూడు రోజుల పాటు సదస్సు నిర్వహించనున్నాయి. భారతీయ పురాణాలు - భారతీయ జానపద, గిరిజన విజ్ఞానం - తులనాత్మక పరిశీలన అంశంపై సదస్సు నిర్వహిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రతినిధులు పత్ర సమర్పణలు చేస్తారని జాతీయ సంస్కృత వర్సిటీ తెలుగు విభాగాధిపతి డాక్టర్ డి.నల్లన్న తెలిపారు.

### మహిళా సాధికారతకు సమానత్వమే పునాది

తిరుపతి(ఆటోనగర్) మార్చి7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళా సాధికారతకు సమానత్వమే పునాది కావాలని డాక్టర్ రోజారమణి అన్నారు. సీఐటీయూ, ఐద్వా సంయుక్తంగా యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సాయంత్రం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించాయి. ఆమె మాట్లాడుతూ మహిళలు పురుషుల కంటే అధికంగా శ్రమిస్తున్నారన్నారు. ఇందులో పురుషులు భాగస్వాములు అయినపుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలని కోరారు.

# సీఎంవోకు స్విమ్స్ నర్సింగ్ డీడీ వ్యవహారం

- ఆమె కోసం రంగంలోకి స్విమ్స్ పెద్దలు
- ప్రశ్నావళి పేరుతో ఉద్యోగుల నుంచి అభిప్రాయ సేకరణ
- అనుకూలంగా నివేదిక సిద్ధం?

తిరుపతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : స్విమ్స్‌లో నర్సింగ్ సిబ్బందిని హడలెత్తించే ఓ డిప్యూటీ డైరెక్టర్ (నర్సింగ్) వ్యవహారం ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరినట్టు తెలిసింది. గత వైసీపీ హయాంలో ఆమె వ్యవహరించిన తీరు, నర్సింగ్ సిబ్బందిని వేధిస్తున్న ఘటనలతో తిరుపతి నుంచి పలువురు సీఎంవోకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో 'ఆమె అంటే హడల్' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనంపై విచారణకు ఆదేశించినట్టు తెలిసింది. దీంతో స్విమ్స్ పెద్దలు ఆమెను కాపాడేందుకు రంగంలోకి దిగారు. ఓ ఐదు ప్రశ్నలతో క్వశ్చనీర్ తయారు చేశారు. 'ఆమె అధికార దుర్వినియోగం చేస్తున్నారా? వివక్ష చూపుతున్నారా? సెలవులు ఆమోదం పొందడంలో ఇబ్బంది పడుతున్నారా?...ఇలా పలు ప్రశ్నలను రూపొందించారు. ఫెస్సీ వర్కర్లు(వార్డు బాయ్స్), ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వో, సీఎస్‌సీఎస్‌డీ సిబ్బంది నుంచి వివరణ తీసుకున్నారు. కొందరు ఉద్యోగుల నుంచి బలవంతంగా అభిప్రాయాలు తీసుకున్నట్టు విమర్శలు వస్తున్నాయి. పనిలోపనిగా అనుమానం రాకుండా మరో ఇద్దరు నర్సింగ్ సూపరింటెండెంట్ల పేర్లను కూడా ప్రశ్నావళిలో పొందుపరిచి వీరి పనితీరుపై కూడా అభిప్రాయం సేకరించారు. ఈ క్రమంలో స్విమ్స్ పెద్దలు ఆమెకు అనుకూలంగా నివేదిక సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ఈ తతంగమంతా డైరెక్టర్ కార్యాలయ కేంద్రంగా జరిగినట్లు సమాచారం. టీటీడీ ఉన్నతాధికారులు దృష్టిపెట్టి పారదర్శకంగా విచారణ చేపడితే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయని స్విమ్స్ సిబ్బంది అంటున్నారు.

# రూ.35 లక్షల ఎర్రచందనం స్వాధీనం

### ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు

తిరుపతి, మంగళం. మార్చి 7(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా బద్వేలు అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూంబింగ్ నిర్వహించి రూ.35 లక్షల విలువగల 34 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ వి.నరేష్ టీము గురువారం బద్వేలు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించింది. సి.రామాపురం సమీపంలో ఎద్దులబోడు వద్ద రెండు మోటారు సైకిళ్లపై ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను గమనించి పారిపోయే ప్రయత్నం చేశారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వెంబడించి పట్టుకున్నారు. ఆ ప్రాంతంలో దాచి ఉంచిన 34 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లు కడప జిల్లాకు చెందిన వారుగా గుర్తించారు. వారి నుంచి రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దుంగలతో సహా స్మగ్లర్లను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. మోటార్ సైకిల్‌తో సహా పట్టుబడ్డ ఎర్రచందనం విలువ రూ.35 లక్షల రూపాయలు ఉంటుందని డీఎస్పీ బాలిరెడ్డి తెలిపారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



## పోస్టల్ క్యారమ్స్ టోర్నీ చాంపియన్స్‌గా తమిళనాడు, మహారాష్ట్ర



మహారాష్ట్ర సర్కిల్ జట్టు - తమిళనాడు సర్కిల్ జట్టు

తిరుపతి(క్రీడలు), మార్చి 7(ఆంధ్రజ్యోతి): 27వ ఆలిండియా పోస్టల్ క్యారమ్స్ టోర్నమెంటు చాంపియన్‌షిప్స్‌గా తమిళనాడు, మహారాష్ట్ర సర్కిల్ జట్లు నిలిచాయి. మల్టీస్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో ఏపీ సర్కిల్ పోస్టల్ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు ఈ టోర్నీ నిర్వహించారు. తుదిపోరు ఆసక్తికరంగా సాగింది.

**విజేతల వివరాలిలా... :** పురుషుల టీమ్ చాంపియన్‌గా తమిళనాడు సర్కిల్ నిలవగా తర్వాత స్థానాలను ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర దక్కించుకున్నాయి. ● మహిళల టీమ్ చాంపియన్‌గా మహారాష్ట్ర సర్కిల్ నిలవగా పశ్చిమ బెంగాల్, తెలంగాణ రెండుమూడు స్థానాలకు పరిమితమయ్యాయి. ● పురుషుల సింగిల్స్‌లో సి.భారతీదాసన్(తమిళనాడు), ఎం.సుమన్(తమిళనాడు), రాజేష్(కర్ణాటక) మొదటి మూడు స్థానాలు దక్కించుకున్నారు. ● మహిళల సింగిల్స్‌లో నీలమ్‌గోడకె(మహారాష్ట్ర), ఆర్.వినిత(తమిళనాడు), సవితదేవి(తెలంగాణ) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ● పురుషుల డబుల్స్‌లో కె.తమిల్‌సెల్వన్-ఆర్.దర్శినీకుమార్(తమిళనాడు) ప్రథమ, సి.భారతీదాసన్-జి.డి.కిషోర్ కుమార్(తమిళనాడు)ద్వితీయ, సోనుచౌదరి-ఎస్.జీవరాజు(తెలంగాణ) తృతీయ స్థానాల్లో నిలిచారు. ● మహిళల డబుల్స్‌లో ఆర్.వినిత-పి.ప్రేమలత(తమిళనాడు) ప్రథమ, రింకీకుమారి-నీలమ్‌గోడకె(మహారాష్ట్ర) ద్వితీయ, నిశకుమారి-నేహకుమారి(మహారాష్ట్ర) తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవం

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఏపీపీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక యూత్ హాస్టల్లో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీపీటీవో జి.నరసింహులు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో మరింతగా రాణించాలని, తమకంటూ ప్రత్యేక గుర్తింపు లభించేలా వ్యవహరించాలని సూచించారు. అధ్యక్షత వహించిన ఎ.మురగమ్మ(ఈయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి)ని, జిల్లా వ్యాప్తంగా ఉన్న 11 డిపోల నుంచి ఓ మహిళా కండక్టర్‌ను సన్మానించారు.

## అలిపిరి పాదాల వద్ద మోకాళ్లపై నిల్చుని వేడుకోలు..!

### కొనసాగిన వెటర్నరీ విద్యార్థుల సమ్మె



తిరుపతి రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారమూ కొనసాగింది. అలిపిరి పాదాల వద్దకు చేరుకుని కొబ్బరికాయలు కొట్టి. మోకాళ్లపై నిల్చుని తమ సమస్యను త్వరగా పరిష్కరించేలా పాలకులకు బుద్ధి ప్రసాదించాలని కోరుతూ దండాలు పెట్టి వేడుకున్నారు. విద్యార్థులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వస్తే తమకు న్యాయం జరుగుతుందని నమ్మకం పెట్టుకున్నామని, అయితే పాలకులు తమగోడు ఆలకించడం లేదని వాపోయారు. వైద్య విద్యార్థుల తరహాలో తమకూ సమానత్వం, గౌరవం, న్యాయం లభించేవరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం వర్సిటీ ప్రధానగేటు ఎదురుగా ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో బైఠాయించి ప్లకార్డులను చేతబట్టి నిరసన కొనసాగించారు.

## రాణీసదాశివమూర్తికి ఠాగూర్ పురస్కారం




పురస్కారాన్ని స్వీకరిస్తున్న రాణీసదాశివమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య రాణీసదాశివమూర్తి విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ పురస్కారాన్ని పొందారు. వేద సాహిత్య, ధర్మ ప్రచారానికి ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. తెలంగాణ గవర్నర్ దేవవర్మ చేతుల మీదుగా పురస్కారాన్ని స్వీకరించారు. కోల్‌కత్తాలోని విశ్వ జ్యోతిష్య విద్యాపీఠంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓరియంటల్ హెరిటేజ్ సంస్థ నిర్వహించిన 46వ వార్షిక అంతర్జాతీయ సదస్సులో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 7(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో శుక్రవారం ఏపీ జేఏసీ అమరావతి తిరుపతి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ సుందరావాణి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కలెక్టరేట్ ఏవో భారతి, సూపరింటెండెంట్ శిరీష, ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మురగమ్మ, అన్ని శాఖల మహిళలు పాల్గొన్నారు.

## మహిళా ఉద్యోగులకు క్రీడలు అవసరం

### శాప్ చైర్మన్ రవినాయుడు



జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న రవినాయుడు

తిరుపతి (వైద్యం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : వృత్తి, కుటుంబ పరంగా సతమతమయ్యే మహిళా ఉద్యోగులకు క్రీడలు మానసికోల్లాసాన్ని, కొత్త ఉత్తేజాన్ని ఇస్తాయని శాప్ శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్వీ వైద్య కళాశాల మైదానంలో శుక్రవారం ఎస్వీ వైద్య కళాశాల, ఏపీజేఏసీ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌తో కలిసి జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. రవినాయుడు మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకట్, జేఏసీ చైర్మన్ సురేష్‌బాబు, మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరిబాబు, నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు రాధమ్మ, నేతలు నీలా, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## నోయిడాలో మెరిసిన ఎస్వీయూ, పద్మావతి వర్సిటీలు

### సాంస్కృతిక పోటీల్లో విద్యార్థుల అత్యద్భుత ప్రదర్శన



జ్ఞాపికను స్వీకరిస్తున్న ఎస్వీయూ, పద్మావతి వర్సిటీ కళా బృందాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సమీపంలోని నోయిడాలో నిర్వహించిన అఖిల భారత యూనివర్సిటీల సాంస్కృతిక సమ్మేళనంలో తిరుపతికి చెందిన ఎస్వీయూ, పద్మావతి యూనివర్సిటీ విద్యార్థులు అత్యద్భుత ప్రదర్శన ఇచ్చారు. ఎస్వీయూకు చెందిన తేజకు క్లే మోడలింగ్‌లో మొదటి స్థానం, ఇన్‌స్టాలేషన్‌లో దేవ, మౌనికకు ద్వితీయ స్థానం, మెహందీలో సంధ్య, దీప్తికి ద్వితీయ స్థానం, రంగోళీలో వీరాంజనేయులు ద్వితీయ స్థానం, పోస్టర్ మేకింగ్‌లో దేవ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఇలా లలిత కళల్లో ఎస్వీయూకు ఓవరాల్ చాంప్ రెండవ స్థానం లభించింది. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు అభినందించారు. పద్మావతి యూనివర్సిటీకి చెందిన ప్రణూష, ప్రత్యూష, మౌనిక, భాను, చంద్రజ్యోతి, మీనా, భాను, శివని, కీర్తి మైమ్‌లో మొదటి స్థానంలో నిలిచారు. స్కిట్‌లో నీలిమ, సత్య భార్గవి, సువర్ణేశ్వరి, సాత్విక, నిహారిక ద్వితీయ స్థానంలో నిలిచారు. వక్తృత్వ పోటీలో ప్రగతి జైస్వాల్ ఐదవ స్థానంలో నిలిచారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో మూడవ స్థానంలో నిలిచారు. వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజని అభినందించారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలో విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా పలు గ్రామీణ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందనిఈఈ వి.చంద్రశేఖరరావు తెలిపారు. మాధవనగర్, రాజీవ్‌నగర్, జీవకోన, సాయినగర్, ఏఐఆర్ బైపాస్ రోడ్డు, రఘునాథకాలనీ, ఎస్‌టీవీనగర్ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

# మౌర్య ఐఏఎస్

డిగ్రీ తర్వాత ఐదేళ్ల శ్రమ ఫలితం ఈ హోదా. సివిల్స్ ప్రయత్నంలో నాలుగుసార్లు అవకాశాలు వచ్చినట్టే వచ్చి చేజారిపోయాయి. ప్రతి వైఫల్యమూ ఒక కొత్త పాఠమే నేర్పింది. చిన్నవయసులో నాన్న చెప్పిన మాటలే లక్ష్యంవైపు నడిచేందుకు స్ఫూర్తిని రగిలించాయి. ఐదో ప్రయత్నంలో 100వ ర్యాంకు సాధించారు మౌర్య. ప్రస్తుతం తిరుపతి నగర కమిషనర్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంశలే అందుకున్నారు. మౌర్య సొంతూరు ప్రొద్దుటూరు సమీపంలోని నాగులపల్లె. మౌర్య పుట్టకముందు ఆ ఊరుకి నీటి సమస్య ఉండేది. ఊళ్లో నీళ్లట్యాంకు నిర్మిస్తే పరిష్కారం అవుతుందని తెలుసు. ఎన్నో విన్నపాలు చేసుకునేవారు. ఒక కలెక్టర్ చొరవతో చిటికెలో ట్యాంకు మంజూరైంది. ఈ ఉదంతాన్ని ఆ ఊరికి సర్పంచ్‌గా ఉన్న వాళ్ల నాన్న చంద్ర ఓబుళ రెడ్డి మౌర్యకు చెప్పేవారు. కలెక్టర్‌ను దేవుడితో పోల్చేవారు. ఆ తర్వాత ఐపీఎస్ అధికారి ఉమేష్ చంద్రప్రసాద్ గురించి సినిమా కథలా చెప్పుకుంటుంటే వాటి ద్వారా మౌర్య ప్రేరణ పొందారు. బీటెక్ పూర్తిచేసిన తర్వాత గ్రామీణాభివృద్ధిపై పీజీ డిప్లొమా కోర్సు చేసి సివిల్స్‌వైపు దృష్టిపెట్టారు. ఐఏఎస్ అధికారిగా మహిళలకు ఒక భరోసాగా మౌర్య నిలుస్తున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



గైడెన్స్, వ్యూహం, సబ్జెక్ట్ ఎంపిక సక్రమంగా ఉంటే సివిల్స్ లక్ష్యం సాధించవచ్చు. ఇవి సరిగ్గాలేక నాలుగేళ్ల పాటు నేను చివరివరకూ వచ్చి చేజార్చుకున్నాను. పెళ్లి చేసేయమని సమాజం నుంచి ఒత్తిడి వచ్చినా తల్లిదండ్రులు నన్ను అర్థం చేసుకున్నారు. అండగా నిలిచారు. లక్ష్యం సాధించాను. ఇప్పుడు నా భర్త సహకారం తోడైంది. అమ్మాయిల ఇష్టాయిష్టాలు తెలుసుకుని కుటుంబం వ్యవహరించాలి

మహిళా దినోత్సవం



**శ్రీసిటీలో దేశ, విదేశాలకు చెందిన 235 సంస్థల్లో 65 వేల మంది ఉద్యోగులు పనిచేస్తుంటే, ఇందులో 34 వేల మంది మహిళలే ఉండడం తిరుపతి జిల్లాలోని ఈ ఆర్థిక మండలి ప్రత్యేకత. ఈ సంస్థల్లో ఏటా రూ. లక్ష కోట్లకు పైగా విలువైన ఉత్పత్తులు తయారవుతుండగా, ఇందులో ఆడవాళ్ల శ్రమ వాటా రూ. 60 వేల కోట్లకు పైగానే కావడం జిల్లాకే గర్వకారణం. శ్రీసిటీ నుంచి ఎగుమతుల విలువే రూ. 57 వేల కోట్లు.**



# స్త్రీ సిరుల సిటీ
## ఆడవాళ్లే అధికం

ఆంధ్రజ్యోతి బ్యూరో, తిరుపతి

శ్రీసిటీలో దేశీయ కంపెనీలతో పాటూ అమెరికా, యూకే, జర్మనీ, చైనా, సింగపూర్, దక్షిణ కొరియా, నెదర్లాండ్స్ ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, బెల్జియం తదితర 30 దేశాలకు చెందిన సంస్థలు వున్నాయి. శ్రీసిటీలోని ప్రతి పరిశ్రమలోనూ మహిళా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రత్యేకించి కొన్ని సంస్థల్లో అయితే 80 నుంచీ 90 శాతం ఉద్యోగులు మహిళలే వుండడం విశేషం. ఉదాహరణకు ఎవర్టైన్ టీ కంపెనీలో 97 శాతం, జెన్ లెనిన్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 90 శాతం, ఎమ్మెస్సార్ గార్మెంట్స్‌లో 80 శాతం, హావెల్స్ (లాయిడ్ ఏసీ)లో 60 శాతం, బ్లూస్టార్‌లో 50 శాతం డైకిన్‌లో 40 శాతం మహిళా ఉద్యోగులు వున్నారు. అన్నింటికన్నా విశేషం ఏమిటంటే ఈ పరిశ్రమల్లో ఉద్యోగాలు చేస్తున్నవారిలో 90 శాతం మంది జిల్లా వాసులే కావడం. అందులోనూ సత్యవేడు, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట ప్రాంతాలకు చెందిన వారే ఎక్కువ. పారిశుద్ధ్య కార్మికుల నుంచీ సెక్యూరిటీ గార్డుల వరకూ... ఆఫీస్ అసిస్టెంట్ నుంచీ హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్‌ల వరకూ... టెక్నికల్ ఆపరేటర్ల నుంచీ సూపర్‌వైజర్లు, మేనేజర్లు, మెయింటెనెన్స్ ఇంజనీర్ల వరకూ... చివరికి మెటీరియల్ లోడింగ్ అన్ లోడింగ్ నుంచీ ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్ వంటి అరుదైన విధుల దాకా అన్ని విభాగాల్లోనూ మహిళా ఉద్యోగులు మగవారితో పోటీ పడి పనిచేస్తున్నారు. కాల్గేట్ టూత్ బ్రష్‌ల తయారీ మొదలు అల్‌స్ట్రామ్ మెట్రో రైళ్ళ తయారీ దాకా మహిళల పాత్ర అధికంగా వుంది. మన జిల్లా మహిళల చేతుల మీదుగా జరుగుతున్న ఈ ఉత్పత్తులు దేశీయంగానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అనేక అభివృద్ధి చెందిన దేశాల ప్రజలకు చేరుతుండడం విశేషం. నిజానికి ఇక్కడ పనిచేస్తున్న స్థానిక మహిళల్లో పెద్దగా చదువుకున్నవారు తక్కువ. నాలుగైదు తరగతులు చదువుకున్న వారికి కూడా శ్రీసిటీలో ఉపాధి లభిస్తోంది. అందుకు అవసరమైన శిక్షణ ఇక్కడ ఇస్తుండడమే కారణం.



### ఖయాల్బీ ఇప్పుడు కూలీ కాదు

తడ మండలం కారూరు గ్రామానికి చెందిన పోలూరు ఖయాల్బీ పదవ తరగతి ఫెయిల్ అయింది. ఎలాంటి ఆస్తి పాస్తులూ లేకపోవడంతో పెళ్ళయ్యాక భర్తతో కలసి కూలి పనులకు వెళ్ళేది. శ్రీసిటీలోని ఎమ్మెస్సార్ గార్మెంట్స్‌లో ఖయాల్బీ పనిచేస్తోంది. ఇపుడామె నెల జీతం రూ. 25 వేలు. గతంలో కూలి పనులకు వెళ్ళిన ఆమె ఇపుడు గర్వంగా తాను శ్రీసిటీ ఉద్యోగినని చెబుతున్నారు.



### తల్లిని పోషిస్తున్న గీత

తడ మండలం కారూరు గ్రామానికి చెందిన రాజేశ్ గీత. ఏడవ తరగతి వరకే చదువుకుంది. భర్త మరణించాడు. పిల్లలు లేరు. తాను బతుకుతూ తల్లిని కూడా పోషించాల్సిన బాధ్యత పైన పడింది. కూలి పనులు చేసే ఆమె, గార్మెంట్స్‌లో చేరి నెలకు రూ. 18 వేలు సంపాదిస్తున్నారు.



### తండ్రికి చేదోడుగా కనక

తడ మండలం కారూరు గ్రామానికి చెందిన కనక బి.కాం చదువుతూ మధ్యలో ఆపేసింది. గార్మెంట్స్ పరిశ్రమలో ఏడేళ్ళుగా క్వాలిటీ కంట్రోలర్‌గా పనిచేస్తున్న కనక ఇపుడు నెలకు రూ. 22 వేలు సంపాదిస్తోంది. తల్లిదండ్రులకు చేదోడుగా వుంటూ తమ్ముళ్ళను చదివిస్తోంది.



### అరుదైన విధుల్లో ఆడవాళ్లు

శ్రీసిటీలోని జెన్ లెనిన్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ఫోమ్ వుపయోగించి కుషన్‌తో కూడిన దిండ్లు, దుప్పట్లు వంటివి తయారు చేస్తారు. ఈ పరిశ్రమలో పలువురు మహిళలు అరుదైన విధులు నిర్వర్తిస్తూ కనిపించారు. వారిలో ఒకరు సత్యవేడు మండలం మాదరపాకం గ్రామానికి చెందిన బాబూ పూర్ణిమ. బీఎస్సీ కంప్యూటర్స్ చదువుతూ మధ్యలో చదువు మానేసిన ఈమెకు భర్త, ముగ్గురు ఆడపిల్లలు వున్నారు. ఏడాదిన్నర కిందట జెన్ లెనిన్ పరిశ్రమలో చేరిన పూర్ణిమ ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్‌గా క్రేన్ తరహా వాహనాలు నడుపుతూ మెటీరియల్‌ను తరలించే విధులను అవలీలగా నిర్వర్తిస్తున్నారు.



### గట్టున పడ్డ గంగమ్మ

వరదయ్యపాలెం మండలం మోపురుపల్లికి చెందిన గంగమ్మకి భూములూ, ఆస్తులూ లేవు. భర్త హమాలీగా బరువులెత్తే పనులకు వెళితే ఈమె వ్యవసాయ కూలీగా పొలాలకు వెళ్ళేది. ఇద్దరూ రెక్కలు ముక్కలు చేసుకున్నా ఇల్లు గడవడం కష్టమయ్యేది. అయితే శ్రీసిటీలోని పరిశ్రమలో చేరడం ఆమె బతుకును మలుపు తిప్పింది. ఐదవ తరగతి వరకే చదువుకున్న గంగమ్మ ఇప్పుడు నెలకు రూ. 18 వేలు జీతం తీసుకుంటోంది. కొడుకులను ఇంజనీరింగ్, డిగ్రీ చదివించగలుగుతోంది.

# కూలీలపైకి దూసుకెళ్లిన మినీ లారీ

- హైవే డివైడర్ వద్ద సుందరీకరణ పనులు చేస్తున్న ఇద్దరి దుర్మరణం
- ముగ్గురికి తీవ్ర గాయాలు



లారీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలైన తిరుపాల్‌ను పట్టుకొని రోదిస్తున్న మహిళ



రమణమ్మ, తిరుపాలు (ఫైల్ ఫొటోలు)



లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన రమణమ్మ

రేణిగుంట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీసు స్టేషన్ సమీపంలోని హైవే వంతెనపై శుక్రవారం మధ్యాహ్నం ఓ గూడ్స్ మినీ లారీ అదుపు తప్పింది. డివైడర్‌ను ఢీకొని.. అటువైపు రోడ్డులోకి దిగి గ్రీనరీ పనులు చేస్తున్న కూలీపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా, ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గాజులమండ్యం ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన ప్రకారం.. పెళ్లకూరు మండలం భీమవరం గ్రామానికి చెందిన ఎనిమిది మంది కూలీలు ఇక్కడి పోలీస్ స్టేషన్ సమీపంలోని హైవే వంతెనపై ఉన్న డివైడర్లకు గ్రీనరీ పనులు చేస్తున్నారు. విమానాశ్రయం సమీపంలోని ఓ కంపెనీకి పాండిచ్చేరి నుంచి మిషన్ విడిభాగాలను తీసుకొస్తున్న మినీ గూడ్స్ లారీ వంతెనపై అతివేగంగా రావడంతో అదుపుతప్పింది. రోడ్డు మధ్యలోని డివైడర్‌ను ఢీకొడుతూ ఆ పక్క రోడ్డులోకి దూసుకుపోయింది. అక్కడ గ్రీనరీ పనులు చేస్తున్న కూలీలను ఢీకొని.. వంద మీటర్లు లాక్కొని పోవడంతో రమణమ్మ (53) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రగాయాలైన తిరుపాల్, నక్కమ్మ, శైలజ, సరోజమ్మను చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తిరుపాల్ (63) మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన డ్రైవరు సంఘటన స్థలం నుంచి పరారయ్యాడని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

### భీమవరంలో విషాదం

పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి: గాజులమండ్యం పోలీసు స్టేషన్ సమీపంలో జరిగిన ఘటనలో ఇద్దరు కూలీలు మృతి చెందడంతో పెళ్లకూరు మండలం నెలబల్లి పంచాయతీ భీమవరం దళితవాడలో విషాదం చోటుచేసుకుంది. గ్రామంలో రబీలో వ్యవసాయ పనులు ముగియడంతో జాతీయ రహదారి డివైడర్ మధ్యలో మొక్కలు నాటే సుందరీకరణ పనులకు కొంతకాలంగా వెళ్తున్నారు. ఈ క్రమంలో జరిగిన ప్రమాదంలో కట్ల రమణమ్మ, దామతోటి తిరుపాల్ మృతి చెందారు. వీరంతా నిరుపేద కుటుంబీకులే. రమణమ్మ భర్త రెండేళ్ల కిందట మృతిచెందాడు. దీంతో కూలీ పనులకు వెళ్లి తన ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నారామె. కూలికి వెళ్తేనే వీళ్లకు పూట గడిచేది. ఇక, సూళ్లూరుపేట మండలం వెలగల పొన్నూరుకు చెందిన తిరుపాల్, ఐదేళ్ల కిందట తన భార్య నాగరాజమ్మ స్వగ్రామమైన భీమవరం వచ్చారు. భార్యతో కలిసి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి మృతితో ఆయా కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి.

# అత్తను చంపిన అల్లుడు

- నగదు, నగల కోసం కిరాతకం
- నిందితుడి కోసం పోలీసుల గాలింపు



హత్యకు గురైన ప్రమీలమ్మ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 7(ఆంధ్రజ్యోతి): నగదు, నగల కోసం అత్తను హతమార్చాడు. ఈ ఘటన తిరుపతి నగరం కోలావీధిలో శుక్రవారం చోటుచేసుకుంది. వెస్ట్ పోలీసుల కథనం మేరకు.. ఎర్రావారిపాలెం మండలం బండమీద కమ్మపల్లికి చెందిన గోపాల్‌రెడ్డి, ప్రమీలమ్మ దంపతులు 30 ఏళ్ల కిందట జీవనోపాధి కోసం తిరుపతికి వలస వచ్చారు. కోలావీధిలోని చిన్నగుంట మోక్షిత నిలయంలో కాపురమున్నారు. ఇప్పుడు ప్రమీలమ్మ(53) స్థానికంగా పాచి పనులు చేసుకుంటుండగా.. గోపాల్‌రెడ్డి మేస్త్రీ పనిచేస్తూ పీపీ చావడి వీధిలోని ఇంట్లో ఉంటున్నాడు. అతడి భార్య ప్రమీలమ్మ చిన్న కుమార్తె రోజా వద్ద ఉంటోంది. రోజాకు తిరుపతికి చెందిన రవినాయక్‌కు ఇచ్చి రెండో వివాహం చేశారు. తిరుమలలో సుమో డ్రైవర్‌గా పనిచేస్తున్న రవినాయక్ తాగుడుకు అలవాటు పడ్డాడు. విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు పెట్టేవాడు. తన ఖర్చుల కోసం అత్త ప్రమీలమ్మ వద్ద ఉన్న డబ్బులు, నగలు ఇవ్వాలని శుక్రవారం డిమాండ్ చేశాడు. ఆమె నిరాకరించడంతో గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. దీనిపై రెచ్చిపోయిన రవినాయక్ ఆమె తలను పట్టుకుని ఇంట్లోని గోడకు బలంగా నాలుగైదు సార్లు మోదాడు. తలపై తీవ్రగాయమై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. రోజా ఫిర్యాదు మేరకు సీఐ మురళీ మోహన్ ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. నిందితుడికోసం ఎస్‌ఐ, తన సిబ్బందితో కలిసి తిరుమల, తిరుపతిలో గాలిస్తున్నారు.

### నేడు జిల్లా జూడో జట్టు ఎంపిక

తిరుపతి(క్రీడలు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస క్రీడా సముదాయంలో శనివారం జిలాస్థాయి జూడో జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జూడో సంఘం జిల్లా కార్యదర్శి జగదీష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు 2005నుంచి 2010 మధ్య జన్మించి ఉండాలని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు కాంప్లెక్స్‌కు చేరుకోవాల్సి ఉంటుందని, ఎంపికైన క్రీడాకారులు ఎన్టీఆర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9059506346ను సంప్రదించాలని కోరారు.

### తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో జూమ్ కాన్ఫరెన్సు ద్వారా మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆయా మండలాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ బోరుబావులు, చేతిపంపులు, గ్రామీణ నీటి సరఫరా పథకాలు సక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు. అవసరమైతే ట్యాంకుల ద్వారా పంపిణీకి సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య, జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు పాల్గొన్నారు.

# భూ పరిహారంలో బినామీలు?

- రూ.కోట్లు కొట్టేసేందుకు పక్కా స్కెచ్

సత్యవేడు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి చేపడుతున్న భూసేకరణలో ప్రభుత్వ భూములకు సంబంధించి పరిహారం కోసం బినామీ రైతుల పేర్లతో కొందరు దళారులు పక్కా స్కెచ్ వేసినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వీరి వ్యవహారశైలి దీనికి బలం చేకూరుస్తోంది. గతేడాది అక్టోబరులో ఏపీఐఐసీ ద్వారా రెండు వేల ఎకరాల భూసేకరణకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. శ్రీసిటీ పరిధిలోని ఇరుగుళం, కొల్లడం, పెద్దఈటిపాకం గ్రామాలలో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి ప్రభుత్వ, పట్టా భూములను గుర్తించి ఏపీఐఐసీకి నివేదిక అందించారు. సత్యవేడు మండలం ఇరుగుళంలో 73 ఎకరాలు, కొల్లడంలో 69, పెద్దఈటిపాకంలో 53 ఎకరాల పట్టా భూములకు నోటిఫికేషన్‌నూ విడుదల చేశారు. మరోవైపు సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో మూడు రోజులుగా అవార్డెడ్ ఎంక్వైయిరీ (రికార్డుల పరిశీలన) ప్రారంభమైంది. కొల్లడం, పెద్దఈటిపాకం, చిన్నఈటిపాకం గ్రామాలలో ప్రత్యేక రెవెన్యూ అధికారులు భూసేకరణ కోసం ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌లోని రైతుల రికార్డులను పరిశీలించారు. భూసేకరణ జరుగుతున్న గ్రామాల్లో భూములు కోల్పోతున్న రైతుల వివరాలతో పాటు, రైతు అనుభవంలో ఉన్న భూ విస్తీర్ణం, అనువంశికం, వన్ బీ, అడంగల్ తదితర రికార్డులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. శ్రీసిటీ గ్రామాలకు చెందిన కొందరు.. ప్రభుత్వ భూముల పరిహారం జాబితాలో బినామీ పేర్లను చేర్చి అడ్డదారిలో లబ్ధిపొందేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇరుగుళం పంచాయతీ సర్వే నెంబర్ 162/1లో 3.82 ఎకరాలకు సంబంధించిన ప్రభుత్వ భూమిలో పరిహారం కోసం రైతులుగా ముగ్గురి పేర్లను జాబితాలో చేర్చారు. చిన్నఈటిపాకం పంచాయతీ సర్వే నెంబర్ 3బీ/1లో 3.88 ఎకరాలకు సంబంధించి మరో నలుగురి పేర్లను నోటిఫికేషన్‌లో చేర్చినట్లు సమాచారం. పరిహారం జాబితాలో ఇద్దరు మాజీ వలంటీర్ల పేర్లు ఉన్నట్లు ఆయా గ్రామాల్లో రైతులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో పర్యటిస్తున్న రెవెన్యూ అధికారులకు ఈ దళారులు సకల సదుపాయాలు సమకూరుస్తూ హల్‌చల్ చేయడం ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. భూ పరిహారం జాబితాలో చోటు చేసుకుంటున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని, అంత వరకు ప్రభుత్వ భూములకు పరిహారం చెల్లించవద్దని కోరుతూ ఆర్డీవో కిరణ్మయికి సీపీఎం నాయకులు దాసరి జనార్దన్, రమేష్ వినతిపత్రం సమర్పించారు.



భూ సేకరణ గ్రామాల్లో రికార్డులను పరిశీలిస్తున్న రెవెన్యూ బృందం







### ఎస్ఎస్ కెనాల్ పూర్తి చేయండి

సోమశిల-స్వర్ణముఖి కాలువ పనులు పూర్తయితే శ్రీకాళహస్తి నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుంది. అలాంటి కాలువను గత వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. రూపాయి కూడా విడుదల చేయకుండా రైతులకు అన్యాయం చేసింది. కూటమి ప్రభుత్వం స్పందించి ఈ కెనాల్‌ను పూర్తి చేయాలి. శ్రీకాళహస్తి పట్టణంలోని కొండమిట్ట, ఎన్టీఆర్‌నగర్, కైలాసగిరి ప్రాంతంలో సుమారు 40 ఏళ్ల నుంచి పదివేల కుటుంబాలకుపైగా ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నాయి. వారందరికీ ఎంజాయ్‌మెంట్ పట్టా మంజూరు చేస్తే ప్రయోజనం చేకూరుతుంది. ఇక, తిరుపతి రూరల్ మండలం ఓటేరు వద్ద రూ.900 కోట్ల విలువైన భూములను కబ్జా చేసేందుకు కొందరు వైసీపీనాయకులు ప్రయత్నిస్తున్నారు. వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన ఓ నేతను ముందుపెట్టి వెనక నుంచి కొందరు ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారు. గతంలో మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, సీఎంగా ఉన్న చంద్రబాబునాయుడు చొరవతో ఈ భూమి ఇప్పటికీ అన్యాక్రాంతం కాకుండా ఉంది. ఇప్పుడు ఆక్రమణలకు గురికాకుండా సంబంధిత మంత్రి చర్యలు తీసుకోవాలి. బడ్జెట్‌లో ప్రతిపాదించిన పనులు సకాలంలో పూర్తి కావాలంటే టైం లిమిట్ పెట్టాలి. జగనన్న కాలనీలకు భూములిచ్చిన రైతుల ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు వేయగా, వెంటనే వేరే వారి ఖాతాలకు ఆ నగదు వెళ్లింది. దీనిపై విచారణ జరిపించాలి.

- బొజ్జల సుధీర్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా జరిగితే

# అధికారులదే బాధ్యత

- స్పష్టం చేసిన ఆర్డీవో

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

చంద్రగిరి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలో ఎక్కడైనా ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా జరిగితే సంబంధిత రెవెన్యూ అధికారులదే బాధ్యతని తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ స్పష్టంచేశారు. ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోందంటూ శుక్రవారం 'టాస్క్‌ఫోర్స్ ఏమైనట్లు?' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. చంద్రగిరి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసినా ఎందుకు పనిచేయడంలేదని ఆగ్రహించారు. ఇకపై ఇలాంటివి జరిగితే వీఆర్వోలపై కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. ఇళ్ల నిర్మాణాలకు మాత్రమే ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వం పెట్టిందని, అంతేగానీ యంత్రాల ద్వారా తవ్వి, భారీ వాహనాల్లో సరిహద్దులు దాటించడం కాదన్నారు. మండలంలో ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. దీనిపై వారు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో మండిపడ్డారు.



చంద్రగిరి మండల రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహన్

### మెగా డీఎస్సీ పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 7(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ పరీక్ష కోసం ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి జ్యోత్స్న తెలిపారు. టెట్ పరీక్షల్లో అర్హత సాధించిన జిల్లాకు చెందిన బీసీ అభ్యర్థులకు మాత్రమే శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మార్చి పది నుంచి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

### దేవప్రసాదరాజుకు అమెరికా ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఫిజిక్స్ ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజుకు అమెరికా బోస్టన్‌లోని యునైటెడ్ సైంటిఫిక్ గ్రూప్ నుంచి ఆహ్వానం అందింది. నవంబరు 3వ తేదీ నుంచి చేపట్టే అంతర్జాతీయ సదస్సులో ప్రసంగించాలని ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కిన్నెత్ బ్లమ్ ఆహ్వానం పంపారు. డెవలప్‌మెంట్ ఆఫ్ ఎర్బియం డోప్డ్ గ్లాస్ మెటీరియల్స్ ఫర్ సి-బాండ్ టెలీ కమ్యూనికేషన్స్ అంశంపై ప్రొఫెసర్ దేవప్రసాదరాజు ప్రసంగించనున్నారు.

### ఇంటర్ పరీక్షలకు 29,101 మంది హాజరు

తిరుపతి(విద్య), మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలకు 29,101 మంది విద్యార్థులు హాజరయ్యారు. శుక్రవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మ్యాథమెటిక్స్ పేపర్ -2ఎ, బోటనీ పేపర్ -2, సివిక్స్ పేపర్ -2 పరీక్షలు నిర్వహించారు. మొత్తం 29,698 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 597 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ చోటుచేసుకోలేదని ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి వెల్లడించారు.

# రాజీ పేరుతో చితకబాదారు

- ఎక్సైజ్ సీఐపై పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

కోట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గొడవ విషయంలో రాజీపోవాలని తనను చావబాదారంటూ వాకాడు ఎక్సైజ్ సీఐపై కల్లుగీత కార్మికుడు ఉప్పల వెంకటేశులుగౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోట మండలం వెంకటపాళెం పంచాయతీ పరిధిలోని వీరారెడ్డిసత్రం గ్రామానికి చెందిన వెంకటేశులుగౌడ్.. తిన్నెలపూడి సమీపంలోని పొలాల్లో గల తాటిచెట్లకు కల్లు గీసుకుని జీవనం సాగిస్తున్నారు. రెండు వారాల కిందట కల్లు విక్రయాలు జరిపే విషయమై ఇతడికి మరో కార్మికుడు రాగయ్య మధ్య వివాదం నెలకొంది. ఈ క్రమంలో వీరిమధ్య రాజీ చేసేందుకు వచ్చిన ఎక్సైజ్ పోలీసులు తనను తీసుకెళ్లి చితకబాదారని వాకాడు ఎక్సైజ్ సీఐపై కోట పోలీసులకు వెంకటేశులు గౌడ్ ఫిర్యాదు చేశారు.

# ఆచార్య వెన్నం ఉమ

## పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వీసీ

చదువు ఒక్కటే తానిచ్చే ఆస్తి అని బలంగా నమ్మే తండ్రి ప్రభావం ఆమెపై చెరగని ముద్ర వేసింది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పట్టుదలతో చదువుకునేలా ప్రేరణ ఇచ్చింది. అందుకే ఆమె నాన్నే తన తొలి గురువు అని చెబుతారు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ఆచార్య వెన్నం ఉమ. ఆది నుంచీ సామాజిక విషయాలపై ఉన్న ఆసక్తితో డిగ్రీలో సోషియల్ వర్క్ సబ్జెక్టును ఎంపిక చేసుకున్నారు. ఉన్నత విద్యా సంస్థలో చదివించాలనే కాంక్షతో 1983లో ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియల్ సైన్సెస్‌లో ఎంఏ కోర్సు చదివారీమె. బోధనతో ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకత్వం వహించే అవకాశం ఉంటుందని భావించారు. ఆదిశగానే కెరీర్‌ను ప్రారంభించారు. నాలుగు దశాబ్దాల పాటు యూనివర్సిటీ స్థాయిలో ప్రొఫెసర్‌గా పని చేసిన ఉమ వివిధ హోదాల్లో పనిచేశారు. పట్టుదలనిండైన ఆత్మవిశ్వాసం ఆమెను పద్మావతి మహిళా వర్సిటీకి సారథిని చేశాయి.



"చదువుతో ఏమైనా సాధించవచ్చు. సమాజంలో గుర్తింపు, గౌరవాన్ని పొందవచ్చు. ఏ రంగంలో ఉన్నా అంకిత భావం, సామాజిక బాధ్యత, నైతిక విలువలను మరవకూడదు. ఇవే అద్వితీయ శక్తులుగా తీర్చిదిద్దుతాయి. చదువు ఉద్యోగం కోసం మాత్రమే కాదని గుర్తించాలి. స్పష్టమైన లక్ష్యంతో, సంకల్పం బలంతో పనిచేయాలి. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి.



## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ఆదిశంకర కళాశాలలో మహిళా దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న మనీషాఖోమేని

గూడూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణించాలని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కోట సునీల్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక రాజావీధిలోని పలు ప్రైవేటు కళాశాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పలువురు మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మనోజ్‌కుమార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, రూపవతి, బాలామణి, కీర్తన, సునీత, శివశంకర్, ప్రణయ్, సూర్య తదితరులు పాల్గొన్నారు. ● స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఐటెక్ కంపెనీ హెచ్‌ఆర్ మనీషాఖోమేని, డాక్టర్లు కల్పన, పద్మావతి, విజయనిర్మల, సునీత, మధురమ్మ పాల్గొన్నారు.

## రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్ నేరం



రాంగ్‌రూట్‌లో వస్తున్న వాహనాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాంగ్ రూట్‌లో వాహనాలను నడపడం నేరమని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. శుక్రవారం పోటుపాళెం కూడలి సమీపంలోని జాతీయరహదారిపై రాంగ్ రూట్‌లో వస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. పలువురు వాహనదారులకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి సహకరించాలి



మంత్రి రామనారాయణరెడ్డి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని ఆలయాల అభివృద్ధికి సహకరించాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కోరారు. శుక్రవారం ఆయన మంత్రిని అమరావతిలో కలిసి వినతిపత్రం అందించారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న దేవదాయల కమిటీలను రద్దు పరిచి వాటి స్థానంలో నూతన కమిటీలను త్వరగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధూపదీప నైవేద్యాలకు రావాల్సిన నిధులను విడుదల చేయాలని కోరారు. చిల్లకూరు మండలం వేళ్లపాళెం గ్రామంలో ఉన్న మటభీమేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కాగా అసెంబ్లీ సమావేశాలలో భాగంగా మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

గూడూరు అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పరిటిపాళెం గ్రామ సమీపంలోని పంబలేరువాగులో శుక్రవారం గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు నలుపు, తెలుపు, పసుపు రంగు చారలు కలిగిన ఫుల్‌హ్యాండ్స్ చొక్కా ధరించి ఉన్నాడు. వయసు 35 వరకు ఉండవచ్చు.

## ఎన్‌బీకేఆర్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన

కోట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఈడీ సెల్ విభాగం ఆధ్వర్యంలో ఎంటర్‌ప్రెన్యూర్ షిప్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సును కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి ప్రారంభించారు. విశాఖపట్టణానికి చెందిన డీఎఫ్‌వో ఎస్‌ఎల్‌ఎన్ కుమార్, తిరుపతికి చెందిన ఇండస్ట్రియల్ ప్రమోషన్స్ ఆఫీసర్ అనిల్‌కుమార్ విద్యార్థులకు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన కల్పించారు. అదే విధంగా స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో స్టూడెంట్స్ చాప్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, దిలీప్ కుమార్ ఉన్నారు.

## ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పెళ్లకూరు, మార్చి 7 (ఆంధ్రజోతి) : మండలంలోని కొత్తూరు 71వ జాతీయ రహదారిపై శుక్రవారం ఆగి ఉన్న ట్రాక్టర్‌ను గూడూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా మరో 9 మందికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో ఉన్న ప్రయాణికులు సుబ్బరత్నమ్మ, సుబ్బరాజు, పెమ్మసాని పద్మలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో 9మందికి స్వల్ప గాయాలయ్యాయి. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, ఎస్‌ఐ నాగరాజులు గాయపడిన వారిని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## ధాన్యం లారీ తగిలి విరిగిన విద్యుత్ స్తంభం

ఓజిలి, మార్చి7 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం లోడు లారీకి విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. ఓజిలి నుంచి ధాన్యంతో ఓ లారీ బయలుదేరింది. పాత పంచాయతీ కార్యాలయం సమీపంలో రోడ్డు వద్ద పైన వెళుతున్న విద్యుత్ వైర్లు ధాన్యం బస్తాలకు తగలడంతో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. విద్యుత్ తీగల నుంచి మంటలు రేగాయి. విద్యుత్ సరఫరా ఆగిపోయింది. లారీ డ్రైవర్ పరారయ్యాడు. విద్యుత్ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని విద్యుత్ స్తంభాన్ని తొలగించి యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరాను రాత్రి 9:30 గంటలకు పునరుద్ధరించారు. కాగా విద్యుత్ వైర్లు తెగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

## విధులు అడ్డుకున్న 36మందికి జరిమానా

వెంకటగిరిటౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): 2011లో రిజర్వు ఫారెస్టు భూముల్లో జాయింట్ సర్వే చేస్తున్న రెవెన్యూ, పోలీస్, ఫారెస్టు సిబ్బందిని అటకాయించి, పోలీసులు జీపునకు గాలి తీసేసి, అటవీ అధికారులు నాటిన మొక్కలు తొలగించిన యాతలూరు గ్రామానికి చెందిన 36 మందికి వెంకటగిరి జడ్జి పీ. అనుషా ఒక్కొక్కరికి రూ. 300 చొప్పున రూ.10800 జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చారని సీఐ ఏవీ రమణ తెలిపారు. మొత్తం 41 మందిపై కేసు ఉండగా వారిలో ఐదుగురు మరణించారని తెలిపారు. ఈ కేసు దర్యాప్తు ఎస్‌ఐ అన్వర్‌బాషా చేశారని తెలిపారు.

## ప్రజాదర్బార్‌ను విజయవంతం చేయండి



సమావేశమైన టీడీపీ నాయకులు

డక్కిలి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ జడ్పీటీసీ సభ్యులు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు పిలుపునిచ్చారు. డక్కిలిలో తొలిసారి నిర్వహించ నున్న ప్రజాదర్బార్ కార్యక్రమం విజయవంతం చేసేందుకు టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ శ్రేణులు సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దందవోలు రత్నాకరరెడ్డి, వెంకటరమణారెడ్డి, సునీల్ రెడ్డి, దందవోలు పెంచలరెడ్డి, పోకూరు రమేష్ నాయుడు, పీపీ చౌదిరి, సర్వేపల్లి రత్నయ్య, పల్లి శ్రీనివాసులు రెడ్డి, సునీల్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు

## సూళ్లూరుపేట/వెంకటగిరి

## 12న కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

సూళ్లూరుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వివిధ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకొన్న వారికి ఈ నెల 12న మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని కమిషనర్ చిన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇంటర్వ్యూల్లో బ్యాంక్ మేనేజర్లు పాల్గొంటారని వివరించారు.

## నేడు ఫాగింగ్ మిషన్ ప్రారంభం

నాయుడుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో దోమల నివారణకు నూతనంగా కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రాన్ని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా శనివారం ప్రారంభించ నున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రజలుల్లా తెలిపారు. స్వర్ణముఖి నదిలో ఉన్న మున్సిపాలిటీ వాహనాల షెడ్ వద్ద వాహనాల సర్వీసుల కోసం వాష్‌మిషన్‌ను కూడా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద మున్సిపల్ నూతన కార్యాలయ భవనానికి ప్రభుత్వం కేటాయించిన భూమిని ఎమ్మెల్యే పరిశీలించనున్నారు.

## నేడు పలు రైళ్ల రద్దు

తడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సదరన్ రైల్వే పరిధిలో జరుగుతున్న ఇంజనీరింగ్ పనుల నేపథ్యంలో శనివారం పలు రైళ్లను సదరన్ రైల్వే అధికారులు రద్దుచేశారు. తమిళనాడు రాష్ట్రం కవరపేట- పొన్నేరిల మధ్య రైళ్ల పట్టాల మార్పిడి వంటి ఇంజనీరింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం నుంచి ఆ పనులు తిరిగి మొదలుకానున్నాయి. దీంతో చెన్నై-సూళ్లూరుపేట మధ్య కొన్ని రైళ్ల రాకపోకలను నిలిపివేసింది. అందులో చెన్నై -సూళ్లూరుపేట- చెన్నై మధ్య నడిచే సబర్బన్ రైళ్లు పూర్తిగా రద్దు కాగా చెన్నైలో ఉదయం 5:40 గంటకు నెల్లూరుకు వెళ్లే ట్రైన్ నంబరు 66029 మెమో రైలు, అలాగే నెల్లూరు నుంచి ఉదయం 10: 20 గంటలకు చెన్నైకు వెళ్లే ట్రైన్ నంబరు 66030 మెమో రైలు శనివారం పూర్తిగా రద్దుచేశారు.

## సెలవు రోజుల్లోనూ పన్ను చెల్లించవచ్చు



కమిషనర్ చిన్నయ్య

సూళ్లూరుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్స రం పూర్తికానున్న నేపథ్యంలో సూళ్లూరుపేట మున్సి పాలిటీలో ప్రజల సౌకర్యార్థం సెలవు రోజులైన శని, ఆది వారం కూడా కార్యాలయంలో పన్నులు చెల్లించ వచ్చునని మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య శుక్రవారం తెలి పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మసీదు ముందు ముస్లింల నిరసన

సూళ్లూరుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని రాఘవయ్యపేటలో ఉన్న జామియా మసీదు కొత్త కమిటీ ఏర్పాటు చేయాలని ముస్లిం సోదరులు శుక్రవారం మసీదు ముందు ప్లకార్డులు పట్టుకొని నిరసన చేశారు. వక్ఫ్‌బోర్డు ముతవల్లీ పనితీరు బాగలేదని ఎమ్మెల్యే చొరవ తీసుకుని కొత్త కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలీ, మున్నా, హఫీజ్, పజాతుల్లా, డాహీర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఆటల పోటీలు



బాల్‌తో గ్లాసులను కొడుతున్న మహిళలు

వెంకటగిరిటౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని సీఐ ఏవీ రమణ ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో షంషాద్ బేగం, కౌన్సిలర్ దొంతు శారద, మహిళలు పాల్గొన్నారు. ● మున్సిపల్ చైర్‌పర్సన్ విశ్వోదయ జూనియర్ కళాశాలల్లో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు.

## వివాహిత ఆత్మహత్య

కోట, మార్చి7( ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఆరునెలల క్రితమే ఆమెకు వివాహమైంది. కుటుంబ కలహాలతో ఇంట్లో ఉరేసుకుని చనిపోయింది. కోట పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

## కొత్తపట్నంలో క్యాన్సర్ పరీక్షలు

కోట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కొత్తపట్నం సచివాలయం వద్ద శుక్రవారం స్థానికులకు ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిగాయి. స్విమ్స్ ఆధ్వర్యంలో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ద్వారా వైద్య పరీక్షలు జరిగాయి. ఉచితంగా మందులు పంపిణీశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ రహదారులకు మహర్దశ

● రూ. 4.30 కోట్లతో కమ్మవారిపాళెం రోడ్డు నిర్మాణపనులు ● రూ. 1.95 కోట్లతో చిగురుపాడు రోడ్డు నిర్మాణపనులు





ఎక్స్‌కవేటర్‌తో చేపడుతున్న కమ్మవారిపాళెం రోడ్డు నిర్మాణ పనులు, రోడ్డురోలర్‌తో చేపట్టి చిగురుపాడు రోడ్డు నిర్మాణ పనులు

నాయుడుపేట టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ చొరవతో దశాబ్దాల కల నెరవేరింది. గ్రామీణ ప్రాంతాల రహదారులకు మహర్దశ పట్టింది. మట్టిరోడ్లు... గ్రావెల్ రోడ్లకే పరిమితమైన రహదారులు నేడు తారు(బీటీ) రోడ్లతో కళకళలాడనున్నాయి. రూ. 6.25 కోట్ల (ఎంజీఎన్‌ఆర్‌ఈజీస్) నిధులతో తారు రోడ్లు వేయడానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రూ.4.30 కోట్లతో కమ్మవారిపాళెంకు తారు రోడ్డు వేస్తున్నారు. జాతీయ రహదారికి సమీపంలోని విన్నమాల గ్రామం నుంచి 5 కిలోమీటర్ల దూరంలో కమ్మవారిపాళెం గ్రామం ఉంది. ఆ గ్రామానికి దశాబ్దాలుగా తారు రోడ్డు లేదు. గుంతలమయంగా మారిన గ్రావెల్ రోడ్డులోనే ప్రజలు ఇంతకాలం రాకపోకలు సాగిస్తూ వచ్చారు. సూళ్లూరుపేట నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా ఎన్నికల సమయంలో నెలవల విజయశ్రీ ప్రచారానికి కమ్మవారిపాళెం వెళ్లారు. ఆ సమయంలో తాను గెలిచిన వెంటనే రోడ్డు వేయిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఆ హామీని నిలబెట్టుకొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి రోడ్ల సమస్యను తీసుకెళ్లారు. కమ్మవారిపాళెం, చిగురుపాడు గ్రామాల పరిస్థితిని తెలియజేశారు. రూ.6.25 కోట్లను మంజూరు చేయించారు. రూ.4.30 కోట్లతో కమ్మవారిపాళెంకు, రూ.1.95 కోట్లుతో చిగురుపాడుకు తారురోడ్డు పనులు కొనసాగుతున్నాయి. దీనిపై ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## ఎందుకో.. ఏమో.. రూటు మారిన బస్సు..!

సూళ్లూరుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపో ఉండేది సూళ్లూరుపేటలో.. బస్సు సర్వీసు నడిచేది సూళ్లూరుపేట-తిరుపతి మార్గంలో.. అయితే ఆ బస్సును ప్రారంభించేది మాత్రం నాయుడుపేటలో. ఇలా ఎందుకు చేస్తున్నారో ఏమో తెలియక స్థానిక నాయకులు, ఆర్టీసీ సిబ్బంది విచారం వ్యక్తం చేస్తున్నారు. సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోకు కొత్త బస్సులు మూడు వచ్చాయి. ఇందులో ఒక బస్సుకు పర్మిట్, రిజిస్ట్రేషన్ వచ్చింది. ఆ బస్సు సూళ్లూరుపేట-తిరుపతి మార్గంలో నడిపేందుకు రూట్ పర్మిట్ వచ్చింది. అయితే ఆ బస్సును ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా నాయుడుపేటలో ప్రారంభించనున్నట్లు డిపో మేనేజర్ మల్లికార్జున ప్రకటన చేశారు. ఇక్కడ డిపో ఉండగా నాయుడుపేటలో ప్రారంభించడం ఏమిటని ప్రజలతో పాటు స్థానిక నాయకులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై డిపోలో పనిచేసే సిబ్బంది గుసగుసలాడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి సూళ్లూరుపేట బస్టాండులోనే బస్సును ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

## నాణ్యమైన విద్యుత్ అందించాలి



మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసులు

సూళ్లూరుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వేసవిలోనూ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలని ఈఈ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన సూళ్లూరుపేట విద్యుత్ శాఖ సబ్ డివిజన్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ విద్యుత్ వినియోగం సామర్థ్యం పెంచుకొంటే 50 శాతం సబ్సిడీ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ శేఖర్, ఏఈలు పూర్ణిమ, మోహిని, మురళి సిబ్బంది ఉన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



సూళ్లూరుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని మన్నారు పోలూరు న్యూకాలనీలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను డీఈఈ శేఖర్, ఏఈ మోహిని ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. కొంత కాలంగా లోఓల్టేజ్ సమస్య ఉండడంతో కాలనీవాసులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీనిపై కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## మందుబాబుల ఘర్షణ..ఒకరికి గాయాలు



గాయపడ్డ ముని

తడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఇద్దరూ మందుల బాబుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు గాయపడ్డారు. తడ శ్రీకాళహస్తి రోడ్డులో ఉన్న మద్యం షాపులో వరదయ్యపాళెం మండలం పులియాలం గ్రామానికి చెందిన ముని మద్యం సేవించడానికి వచ్చాడు. అదే మండలం కారిపాకం గ్రామానికి వినోద్ కూడా అక్కడకు వచ్చాడు. ఎదురెదురుగా కూర్చొని మద్యం తాగారు. పక్కపక్క ఊర్లకు చెందినవారు కావడంతో మాటమాట కలిసింది. కొంతసేపటి తరువాత ఆ మాటలు ఇరువురి మధ్య ఘర్షణకు దారితీశాయి. ఇద్దరూ గొడవకు దిగారు. మద్యం మత్తులో ఉన్న వినోద్ బీరు బాటిళ్లతో ముని తలపై దాడిచేసి పరారయ్యాడు. గాయపడిన మునిని స్థానికులు ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పోలీసులు విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా మద్యం షాపుల నిర్వాహకులు గదులు అద్దెకు తీసుకుని బార్లను తలపించేలా నడుపుతున్నారు. షాపుల వద్దే మద్యం సేవించడం వల్ల తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి.

## ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు

తడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. శుక్రవారం తడ పోలీస్ స్టేషన్‌కు సాధారణ తనిఖీలో భాగంగా విచ్చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నాయుడుపేట, సూళ్లూరుపేట, తడల్లో ట్రాఫిక్ రద్దీ నియంత్రణ కోసం ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా వాహనదారులు అతివేగాన్ని నియంత్రించేలా చర్యలు తీసుకో నున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రధాన కూడళ్లలో వాహనాలు ఎక్కడ పడితే అక్కడ నిలపరాదని వాహన దారులు ట్రాఫిక్ నియమావళిని పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. మాంబట్టు సెజ్‌రోడ్డులో కొండూరు చెరువులో అనుమానాస్పద స్థితిలో మహిళ మృతిచెందిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామని ఇందుకోసం ఒడిశాకు సైతం పోలీసులను పంపామని వివరించారు. ఆయనవెంట తడ ఎస్‌ఐ కొండప నాయుడు ఉన్నారు.

## డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శంకర్ శర్మ

సూళ్లూరుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వీఎస్‌ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మహిళా సాధికార ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్‌ఎల్‌బి శంకర్‌శర్మ మాట్లాడుతూ స్త్రీలను గౌరవించడం మన సంప్ర దాయమని నేడు పురు షులకు దీటుగా అన్ని రంగాల్లో మహిళలు రాణి స్తున్నారన్నారు. ముందుగా విద్యార్థులు, మహిళా అధ్యాపకులకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్య క్రమంలో ఉప ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, మహిళా సాధికార విభాగ కన్వీనర్ ఉషారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

పెళ్లకూరు, మార్చి 7 (ఆంధ్రజోతి) : ఈ నెల 17వ తేదీ నుంచి జరిగే పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డిప్యూటీ డీఈవో డీ శాంతకుమార్ ఆకాంక్షించారు. శుక్రవారం పెళ్లకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించి వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమావేశమై పలు సబ్జెక్ట్‌ల్లో ప్రశ్నలు వేసి సమాధాలు రాబట్టారు. ప్రధానోపాధ్యాయులు మునిశేఖర్ ఉన్నారు.

## మందుబాబుల అడ్డాగా పేట బస్టాండు



ఆర్టీసీ బస్టాండు నుంచి మందుబాబును పంపిస్తున్న పోలీసులు

సూళ్లూరుపేట, మార్చి 7 (ఆంధ్ర జ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండులో మందు బాబుల బెడద అధికంగా ఉంది. ప్రతిరోజూ మద్యం సేవించి మందుబాబులు అక్కడకు చేరుకొని అక్కడి ప్రయాణికులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. తమిళనాడుకు సరిహద్దు కావడంతో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న పట్టణంలో రాత్రి 11 గంటల వరకు కూడా జనసంచారం ఉంటుంది. పట్టణ నడిబొడ్డులో ఉన్న ఆర్టీసీ బస్టాండులో రాత్రి 7:30 గంటలు అయ్యిందంటే ఆర్టీసీ అధికారులు ఎవరూ కనబడరు. కంట్రోల్ పాయింట్ ఉన్న మూసేసి వెళ్తున్నారు. దీంతో రాత్రి అయితే మందు బాబులకు బస్టాండు అడ్డాగా మారిపోతోంది. దీంతో బస్టాండుకు వచ్చే మహిళా ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. శుక్రవారం రాత్రి ఓ మందుబాబు తప్పతాగి బస్టాండులో దుస్తులు విప్పేసి బూతులు మాట్లాడుతూ హల్‌చల్ చేస్తూ కనిపించాడు. అక్కడున్న ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెళ్లి మందుబాబును అక్కడ నుంచి పంపిం చేశారు. కంట్రోల్ పాయింట్‌లో కనీసం రాత్రి 10 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉండేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసు కోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# పుత్తూరు వార్తలు

## మయూర వాహనంపై ఊరేగిన సుబ్రహ్మణ్యేశ్వరుడు



పుత్తూరు టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణంలోని తిరుపతి రోడ్డులో వెలిసియున్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం 53వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లు మయూర వాహనంపై ఊరేగారు. శుక్రవారం ఉదయం అమ్మవార్ల సమేత స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మయూర వాహనంపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వగా, కర్పూర నీరాజనాలతో మొక్కులు తీర్చుకున్నారు.

## రేపు పుత్తూరులో తిరుపతి జిల్లా బ్రాహ్మణ సంఘాల సేవా సమాజ సమావేశం

పుత్తూరు అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య తిరుపతి జిల్లా సమావేశం పుత్తూరు నూతన బ్రాహ్మణ భవనంలో ఈ నెల 9వ తేదీన ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఓ.వి.రామశర్మ, ప్రధాన కార్యదర్శి కె.మల్లికార్జున శర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని తిరుపతి, చంద్రగిరి, పుత్తూరు, నగరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, గూడూరు, నాయుడుపేట, వాకాడు, సూళ్లూరుపేట, వెంకటగిరి ప్రాంతాలనుంచి బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

## రెండో పెళ్లి చేసుకున్న వ్యక్తి అరెస్టు

వెదురుకుప్పం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మొదటి భార్యను అదనపు కట్నం కోసం వేధించడంతోపాటు పిల్లలు పుట్టలేదన్న కారణంతో రెండో పెళ్లి చేసుకున్న వ్యక్తిని అరెస్టు చేశారు. కార్వేటినగరం ఎస్‌ఐ పి.రాజ్‌కుమార్ శుక్రవారం మీడియాకు వివరాలు తెలిపారు. పుత్తూరు పట్టణంలోని షాపుస్ట్రీట్‌కు చెందిన పి.సుబ్రహ్మణ్యం, అరుణ దంపతుల కుమార్తె పి.మౌనికను కార్వేటినగరం మండలం సురేంద్రనగరం కాలనీకి చెందిన పి.బ్రహ్మయ్య కుమారుడు పూడి గౌతమ్ 2016లో వివాహం చేసుకున్నాడు. తర్వాత తన కుటుంబీకులతో కలసి మౌనికను అదనపు కట్నం కోసం వేధిస్తూ వచ్చాడు. అనంతరం పిల్లలు పుట్టలేదన్న కారణం చూపి.. మరో యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయమై మౌనిక కార్వేటినగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గౌతమ్‌ను అరెస్టు చేసి.. శుక్రవారం రిమాండుకు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

## రాయలసీమలో బీజేపీని బలోపేతం చేయండి

● రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



విమానాశ్రయంలో పురందేశ్వరికి స్వాగతం పలుకుతున్న సామంచి శ్రీనివాస్

రేణిగుంట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాయలసీమలో బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి నాయకులకు సూచించారు. మహిళా దినోత్సవం సందర్భంగా చిత్తూరులో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు శుక్రవారం సాయంత్రం విజయవాడ నుంచి తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న పురందేశ్వరికి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె బీజేపీ నాయకులతో మాట్లాడుతూ రాయలసీమలోని అన్ని జిల్లాల్లో నూతన కమిటీల నిర్మాణం, బాధ్యతల గురించి సూచనలు, సలహాలు అందజేశారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివనారాయణ, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్, నాయకులు చంద్రప్ప, డాక్టర్ శ్రీహరి, వరప్రసాద్, భాస్కర్, పురుషోత్తమ నాయుడు, గాలి పుష్పలత తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆమె రోడ్డు మార్గాన తిరుపతికి బయలుదేరి వెళ్లారు.

### పురందేశ్వరిని కలిసిన గుత్తి త్యాగరాజు

వరదయ్యపాళెం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని శుక్రవారం తిరుపతి విమానాశ్రయంలో చేనేత, రాష్ట్ర దేవాంగ అభ్యుదయ సేవా సంఘం కన్వీనర్, బీజేపీ నాయకుడు గుత్తి త్యాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు.

### ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం




మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నాగరాజు నాయుడు

శ్రీకాళహస్తి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ నాగరాజు నాయుడు మాట్లాడుతూ మహిళాభివృద్ధి, వారు సాధించిన విజయాలను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ నరసింహవర్మ, అధ్యాపకులు బాపనయ్య, తులసీ, సునీత, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

### పిచ్చాటూరులో...



ఉపాధ్యాయినులను సన్మానించిన ఎంపీడీవో మహ్మద్‌రఫీ

పిచ్చాటూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంఈవో కె.హేమమాలిని అధ్యక్షతన శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో మహ్మద్‌రఫీ మాట్లాడుతూ మహిళలపై హింసను నిర్మూలించడం కోసం సాంఘిక దురాచారాలపై అవగాహన కల్పించి, మహిళలపై జరుగుతున్న అన్యాయాన్ని ప్రతిఘటిద్దామని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయినులను మహిళా మహారాణులుగా పేర్కొంటూ సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### జనసేనలోకి విశ్రాంత తహసీల్దారు



చంద్రశేఖరరావుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోట వినుత

శ్రీకాళహస్తి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీలో పట్టణానికి చెందిన విశ్రాంత తహసీల్దారు చిట్టత్తూరు చంద్రశేఖర రావు శుక్రవారం చేరారు. ఆయనకు నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సమస్యల పరిష్కారానికి, పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. జనసేన నాయకులు తోట గణేష్, పేట చంద్రశేఖర్, కావలి శివకుమార్, లక్ష్మీ, రాజ్యలక్ష్మీ, వెంకటరమణ యాదవ్, దుమ్ము రాయల్ తదితరులు పాల్గొన్నారు.

### 10న బీసీ కార్పొరేషన్ రుణ మంజూరుకు ఇంటర్వ్యూలు

కేవీబీపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలో జనవరి 2025 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు ప్రభుత్వం ద్వారా బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానించారు. వారికి ఈనెల 10వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎస్‌బీఐ కోవనూరు, ఎస్‌బీఐ రాజులకండ్రిగ, మండల కేంద్రంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఎంపీడీవో రాధారాణి తెలిపారు.

### టీడీపీ నాయకుడికి పరామర్శ

శ్రీకాళహస్తి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిపూడి దశరథాచారి అనారోగ్యంతో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత శుక్రవారం ఆస్పత్రికి చేరుకుని ఆయన్ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

### నిత్యావసర సరుకుల పంపిణీ



పేద ముస్లిం కుటుంబాలకు అందిస్తున్న నిత్యావసర సరుకులు

వరదయ్యపాళెం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీఎల్ఎన్‌పల్లి గ్రామంలో ఎన్‌ఆర్‌ఐ షేక్ బాబు నూరుద్దీన్ ఆర్థిక సాయంతో శుక్రవారం షేక్ అబ్దుల్ సుమారు 30మంది పేద ముస్లిం మైనార్టీలకు నిత్యావసర సరుకులను పంపిణీచేశారు. షేక్ అబ్దుల్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం ఆనందంగాఉందన్నారు. వారికి ముస్లిం కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపాయి.

## వైభవంగా పుష్పయాగం



వెంకటేశ్వరస్వామికి పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం తొండమానుపురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. గురువారం ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగియగా, శుక్రవారం సాయంత్రం స్వామి అమ్మవార్లకు పుష్పయాగాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు స్వామి అమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. విశేషంగా అలంకరించి పుష్పయాగం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### జన ఔషధిక్ మందులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి జన ఔషధిక్ దినోత్సవంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో జన ఔషధిక్ కేంద్రంలో పేద, మధ్య తరగతి ప్రజలకు అనుగుణంగా అతి తక్కువ ధరలకే మందులు అందుతాయన్నారు. బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధులు, గ్యాస్ సమస్యలకు నాణ్యమైన మందులు అతితక్కువ ధరలకే అందిస్తున్నట్లు తెలిపారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### అక్రమాలు అడ్డుకున్నందుకే కేసులు



కోర్టు ఆవరణలో టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అక్రమాలను అడ్డుకున్నందుకే తమపై అక్రమ కేసులుపెట్టడంతో వాయిదాకు వచ్చినట్లు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కోర్టు వాయిదాకు ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ఏర్పేడు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏకగ్రీవం చేసుకునేందుకు మిగిలిన సర్పంచు అభ్యర్థుల నామినేషన్ల పత్రాలను చించివేశారన్నారు. అపుడు జరిగిన ధర్నాలో తమపై తప్పుడు కేసులు పెట్టారన్నారు. దాని ఫలితంగా ప్రస్తుతం కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివశంకర్‌రెడ్డి, నాగరాజు నాయుడు, రమణ, హరి, వినోద్, న్యాయవాది జైసారథి తదితరులు పాల్గొన్నారు.

### పదవీ విరమణ సన్మానం



ఏఎస్‌ఐని సన్మానిస్తున్న సీఐ, ఎస్ఐ, సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): క్రమ శిక్షణకు మారు పేరుగా ఏఎస్ఐ శివకుమార్ పని చేశారని సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. మండల పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐ శివకుమార్ శుక్రవారం పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. పోలీసులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. రూరల్ ఎస్ఐ నరసింహారావు, పోలీసులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేదు

శ్రీకాళహస్తి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో రెండవ శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం లేదని అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో నెలవారీ విద్యుత్ మరమ్మతుల కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరో తేదీని ప్రకటిస్తామన్నారు.

### ఈద్గా నిర్మాణానికి సిమెంటు బస్తాల వితరణ

శ్రీకాళహస్తి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలో రంజాన్ మాసంలో ముస్లిం మైనార్టీల కోసం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాలతో ఈద్గా నిర్మాణం చేపట్టారు. అందులో భాగంగా పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు షేక్ జహీర్ అహ్మద్ తన వంతు సాయంగా శుక్రవారం 40 సిమెంట్ బస్తాలను వితరణగా అందజేశారు. ఆయనను టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంఠా రమేష్, జిలానీ, అబ్దుల్ కరీం, బషీర్, కరీం, అంజాద్ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

## మల్లెపూల సాగుతో మహిళల ఆర్థిక స్వావలంబన

పుత్తూరు టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డల నుంచి అమ్మవారి జాతర్ల వరకు మల్లెపూల సువాసనలు గుబాళిస్తుంటాయి. ఆడబిడ్డలకు మల్లెపూల జడలు కుట్టించడం, అమ్మవారి జాతర్లలో, వివాహాది శుభకార్యాల్లో మల్లెపూలను విరివిగా వినియోగిస్తుంటారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన మల్లెపూల సాగుతో పుత్తూరు మండలంలోని పలు గ్రామాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. రైతులుగా, వ్యాపారులుగా, కూలీలుగా రాణిస్తున్నారు. ప్రస్తుతం కిలో మల్లెపూల ధర రూ.200 నుంచి రూ.300 వరకు పలుకుతోంది. పుత్తూరు మండలంలోని తొర్రూరు, తిమ్మాపురం, కట్టకింద రామకృష్ణాపురం, మిట్టపల్లూరు, కొండలచెరువు, నేషనూరు తదితర గ్రామాల్లో మల్లెపూల సాగు విస్తారంగా చేస్తున్నారు. పుత్తూరు నుంచి సుదూర ప్రాంతాలైన చెన్నై, తిరుపతి, శ్రీకాళహస్తి, చిత్తూరు వంటి పట్టణాలకు మల్లెపూలను బస్సుల్లో తరలిస్తుంటారు. మల్లెపూలు సాగుచేయడమే కాకుండా మహిళలే వాటిని కట్టి విక్రయిస్తూ రాణిస్తున్నారు. ఇలా మల్లెపూల సాగుతో మహిళలు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను లాభాలు అర్జిస్తున్నారు.



మల్లె పూలు కోస్తున్న మహిళ

### తక్కువ ఖర్చుతో అధిక లాభాలు



ఒకసారి మల్లె మొక్క నాటితే నాలుగేళ్ల వరకు ఆదాయం వస్తుంది. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు వస్తాయి. పువ్వులు కోయడానికి కూలి డబ్బులు ఇచ్చినప్పటికీ వేసవిలో లాభాలు గడిస్తున్నాం. పూల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటే బాగుంటుంది.

- మునెమ్మ, కట్టకింద రామకృష్ణాపురం

### మల్లెలతో ఉపాధి



మల్లెపూల సాగుతో తమతో పాటు చాలా మందికి ఉపాధి కల్పిస్తున్నాం. చుట్టుప్రక్కల ప్రాంతాలకు ఎగుమతి చేయడం ద్వారా మరింత ఆదాయం వస్తోంది. ఒక్క వేసవి కాలంలోనే మల్లెతోటలతో అత్యధికంగా ఆదాయం వస్తుంది.

- రాజేశ్వరి, కట్టకింద రామకృష్ణాపురం

## ఓటేరు భూములపై రైతులకు అన్యాయం చేయడం తగదు

● ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఎస్సీవీ నాయుడు హితవు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు

శ్రీకాళహస్తి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం ఓటేరు భూములకు సంబంధించి రైతులకు అన్యాయం చేసేలా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వ్యవహరించడం తగదని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు అన్నారు. శుక్రవారం ఆయన తన స్వగృహంలో ఓటేరు భూములపై మీడియాతో మాట్లాడారు. చెరువు భూములు.. రైతుల భూములు వేర్వేరని తాను ఇప్పటికే ఎన్నో సార్లు బ్రిటీష్ కాలం నుంచి ఉన్న రికార్డులను బహిర్గతం చేశానన్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, వైసీపీ నేత, చంద్రగిరి మాజీఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో కలిసి మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు నడపడం దుర్మార్గమన్నారు. తాను టీడీపీ ఆవిర్భావం, పునాది దశ నుంచీ పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. శ్రీకాళహస్తితో పాటు పొరుగున ఐదు నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేశానన్నారు. బొజ్జల కుటుంబంతో రాజకీయంగా మూడు తరాల నుంచి కలిసి నడుస్తున్నట్లు చెప్పారు. తామంతా వెంట ఉండి కష్టపడటంతో అదృష్టవశాత్తు ఎమ్మెల్యేగా గెలిచిన సుధీర్‌రెడ్డి.. అహంకార ధోరణితో వ్యవహరించడం మానుకోవాలన్నారు. గుడి, బడి ఏవీ వదలకుండా అక్రమాలకు పాల్పడుతున్న విషయాలను టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎమ్మెల్యేపై వంద పేజీల అవినీతి అక్రమాల చిట్టాను బహిర్గతం చేస్తామన్నారు. పార్టీ పెద్దలు ఆదేశిస్తే పూర్తి ఆధారాల సహా లిఖితపూర్వకంగా సమర్పిస్తామన్నారు. ఎమ్మెల్యే మ్యాచ్‌ఫిక్సింగ్, అక్రమాలను ఎప్పటికప్పుడు వారం వారం వెల్లడిస్తామన్నారు. టీడీపీలో ఉంటూ పార్టీని భ్రష్టు పట్టించడం తగదని, పార్టీ పటిష్టత కోసం తాను ఎంత వరకైనా పోరాడతానన్నారు.

### దానగుణమే దైవత్వం



పేదలకు అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): దాన గుణమే దైవత్వమని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేషరావు అన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలు దిగ్విజయంగా ముగియడంతో శుక్రవారం బీసీ విభాగం ఆధ్వర్యంలో అంబలి స్వామి ఆశ్రమం వద్ద అన్నదానం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి నేతృత్వంలో మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతంగా జరిగినందుకు గాను ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మిన్నల రవి, నెమళ్లూరు బుజ్జి, నివేదిత మోరె, గిరిప్రసాద్, వంశీ, సునీల్, మణి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### తెలుగుగంగ నీరు అందించి పంటలను కాపాడాలి




తెలుగుగంగ డీఈకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ నీటిని అందించి ఎండుతున్న పంటలను కాపాడాలని మండలంలోని రైతులు తెలుగుగంగ డీఈ పెంచలయ్యకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రస్తుతం గంగ నీటిని ఆపివేయడం వలన కల్లివెట్టు, తలారివెట్టు, వేణుగోపాలపురం, నెలవాయి, నెరిజికండ్రిగ, కుక్కంబాకం తదితర గ్రామాల్లో మిరప, వేరుశనగ, పుచ్చ తదితర పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. ఈ నెలాఖరు వరకు గంగ నీటిని విడుదల చేస్తే పంటలు చేతికి వస్తాయని తెలిపారు. దీనిపై స్పందించిన డీఈ జిల్లా అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేస్తామని రైతులకు హామి ఇచ్చారు. రైతులకు మద్దతుగా సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య పాల్గొన్నారు.

### ఐదుగురు గంజాయి విక్రేతల అరెస్టు

రేణిగుంట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రేణిగుంట పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు యువకులను అరెస్టు చేసి వారి వద్ద ఉన్న కేజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపారు. డీఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని హిందూ శ్మశానవాటిక సమీపంలో గంజాయి విక్రయిస్తున్న స్థానిక వినాయకనగర్‌కు చెందిన రాము, రాజు, పాంచాలీనగర్‌కు చెందిన సాయిప్రసాద్, మదన్, ఏఎస్ఆర్ కాలనీకి చెందిన గురవయ్యలను అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న కేజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ పేర్కొన్నారు.

### జూనియర్ కళాశాల ప్రారంభం

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని శ్రీనివాసతేజ గ్రూపు ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో యోగి జూనియర్ కళాశాలను ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రహ్మణ్యం, ఏపీ స్టేట్ ఏపీపీఎస్ఏ డెమోక్రటిక్ అధ్యక్షులు గొల్లపూడి మోహన్‌రావు శుక్రవారం ప్రారంభించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్సు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రదర్శనలు తయారుచేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. యోగి జూనియర్ కళాశాల అకడమిక్ డైరెక్టర్ యోగేష్ కుమార్, ఏపీపీపీఎస్ఏ రాష్ట్రకార్యదర్శి శ్రీనివాసరావు, గుంటూరు, ఒంగోలు జిల్లాల అధ్యక్షులు హరిబాబు, శ్రీనివాసరావు, తిరుపతిజిల్లాకు చెందిన శ్రీధర్, సుగుణ, రవి పాల్గొన్నారు.

### ఘనంగా శుక్రవారం ఉత్సవం



శ్రీకాళహస్తి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువు తీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



### పాఠకులకు ముఖ్యగమనిక